





# అక్షర రేఖ

తెలుగు దినపత్రిక

Simultaneously Published from Adilabad

RNI NO. TELTEL /2012/44706

బుధవారం 10 సెప్టెంబర్ 2025 | Akshara Rekha Telugu Daily | వెల : రూ.2/- | సంపుటి : 13 | సంపుటి : 313 | పేజీలు : 8


## అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం



- వరద బాధితులకు ప్రధాని నరేంద్ర మోదీ భరోసా
- హిమాచల్ ప్రదేశ్, పంజాబ్‌లో పర్యటన
- వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే
- తక్షణ సాయం కింద హిమాచల్‌కు రూ.1,500 కోట్లు, పంజాబ్‌కు రూ.1,600 కోట్లు

3



### దోహాపై ఇజ్రాయెల్ బాంబులు

- ఇద్దరు హమాస్ నేతలు..ముగ్గురు అంగరక్షకుల మృతి
- మాదే బాధ్యత: నెతన్యాహు
- ఖండించిన సౌదీ, ఫ్రాన్స్
- బంకర్‌లోకి ఇరాన్ సుప్రీంలీడర్!

3

## మళ్లీ దిద్దాల్సిందే!

### గ్రూప్-1 మెయిన్స్‌పై తేల్చి చెప్పిన హైకోర్టు

- మార్చిలో ఇచ్చిన జనరల్ ర్యాంకింగ్ లిస్ట్ రద్దు.. తుది మార్కుల జాబితా కూడా..
- జవాబు పత్రాలు మాన్యువల్‌గా పునఃమూల్యాంకనం చేయాలి
- ఆ మేరకు ఫలితాలు ప్రకటించి పోస్టులు భర్తీ చేయాలి... మూల్యాంకనం సాధ్యం కాకుంటే మళ్లీ మెయిన్స్ పరీక్ష పెట్టండి
- ఈ ప్రక్రియంతా 8 నెలల్లో పూర్తవ్వాలి
- నోటిఫికేషన్, నిబంధనల మేరకు పరీక్ష జరగలేదు... కమిషన్ చర్యలు మెయిన్స్ పరీక్షల పవిత్రతను దెబ్బతీశాయి
- ఒకరి మార్కులు మరొకరికి తెలియకుండా చేయడం పారదర్శకతను దెబ్బతీస్తోందన్న న్యాయమూర్తి



హైదరాబాద్

గ్రూప్–1 మెయిన్స్ పరీక్షల జవాబు పత్రాలను మళ్లీ దిద్దాల్సిందేనని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ)కు హైకోర్టు తేల్చిచెప్పింది. మార్చి 10న వెలువరించిన తుది మార్కుల జాబితా, మార్చి 30న ప్రకటించిన జనరల్ ర్యాంకింగ్ జాబితా (జీఆర్ఎల్)ను రద్దు చేసింది. గ్రూప్–1 మెయిన్స్‌కు సంబంధించిన అన్ని సమాధాన పత్రాలను మాన్యువల్‌గా తిరిగి మూల్యాంకనం చేసి ఫలితాలను ప్రకటించాలని ఆదేశించింది. సంజయ్‌సింగ్ అండ్ అదర్స్ వర్సెస్ యూపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్, అలహాబాద్ కేసులో సుప్రీంకోర్టు తీర్పు మేరకు మోడరేషన్ పద్ధతిని వర్తింపజేయాలని స్పష్టం చేసింది. ఆ ఫలితాల - మిగతా2లో

## ఆగ్రహ జ్వాలలు



### నేపాల్‌లో మహోగ్రరూపం దాల్చిన ఆందోళనలు
### రెండోరోజూ రెచ్చిపోయిన విద్యార్థులు, యువత

- పోలీసులతో ఘర్షణ, హింసాత్మక ఘటనల్లో 22కు పెరిగిన మరణాలు
- పార్లమెంట్‌కు నిప్పుపెట్టిన ఆందోళనకారులు
- నైతిక బాధ్యతగా పదవీత్యాగం చేసిన ప్రధానమంత్రి కేపీ శర్మ ఓలీ
- మంటల్లో కాలి చనిపోయిన మాజీ ప్రధాని ఖనాల్ సతీమణి
- నేపాల్‌తో సరిహద్దు వద్ద పహారాను కట్టుదిట్టంచేసిన భారత్
- కార్మండు మేయర్ బాలెన్‌ను కొత్త ప్రధానిగా చేయాలన్న ఆందోళనకారులు
- కర్ఫ్యూలోనూ వీధులను కదనరంగంలా మార్చిన విద్యార్థులు
- రక్తమోడిన మాజీ ప్రధాని షేర్ బహదూర్ దేవ్‌బా దంపతులు
- అగ్నికి ఆహుతైన పలువురు నేతల ఇళ్లు.. ప్రధానకార్యాలయాలూ ధ్వంసం

3

## పీసీసీ అధ్యక్షుడే అప్రూవర్‌గా మారారు

- ఆ 10 మంది ఎమ్మెల్యేలు మా పార్టీలో చేరారని చెప్పారు
- స్పీకర్ నిర్ణయం తీసుకోకపోతే సుప్రీంకోర్టుకు వెళ్తాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్

'ఆ పది మంది ఎమ్మెల్యేలు మా పార్టీ లో చేరారని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ మొన్న టీవీల్లో చెప్పారు. ఆయనే - మిగతా2లో

## కొత్త ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్

### ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిపై ఘన విజయం

- తమిళనాడు నుంచి ఈ పదవిని చేపట్టనున్న మూడో నేతగా ఘనత
- ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో రాధాకృష్ణన్‌కు 452, సుదర్శన్‌రెడ్డికి 300 తొలి ప్రాధాన్యత ఓట్లు
- 152 ఓట్ల తేడాతో గెలుపొందిన ఎన్డీయే కూటమి అభ్యర్థి.... మొత్తం పోలైన ఓట్లు 767.. వాటిలో చెల్లనివి 15 ఓట్లు
- 98.20 శాతంగా నమోదైన పోలింగ్.. ఓటింగ్‌కు గైర్హాజరైన 13 మంది ఎంపీలు
- ఇండియా కూటమి నుంచి పలువురు ఎంపీల క్రాస్‌ఓటింగ్



న్యూఢిల్లీ

దేశ 15వ ఉపరాష్ట్రపతిగా బీజేపీ నేతృత్వంలోని నేషనల్ డెమొక్రటిక్ అలయెన్స్ (ఎన్‌డీఏ) తరఫున పోటీ చేసిన చంద్రపురం పొన్నుస్వామి రాధాకృష్ణన్ ఎన్నికయ్యారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి పక్షాల ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిపై ఆయన ఘన విజయం సాధించారు. రాధాకృష్ణన్ 452 ఓట్లు సాధించగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి 300 ఓట్లు పొందారు. దీంతో 152 ఓట్ల తేడాతో రాధాకృష్ణన్ గెలుపొందినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, రాజ్యసభ సెక్రటరీ జనరల్ పీసీ మోదీ మంగళవారం రాత్రి ప్రకటించారు. దీంతో రాధాకృష్ణన్ త్వరలోనే ఉపరాష్ట్రపతిగా ప్రమాణస్వీకారం - మిగతా3లో

## ఆర్ఆర్ఆర్ ఉత్తరం పనులు ప్రారంభించండి

- హైదరాబాద్ బందర్ మధ్య 12 వరుసల కొత్త రోడ్డుకు అనుమతివ్వండి
- శ్రీశైలానికి 4వరుసల ఎలివేటెడ్ కారిడార్ కావాలి
- హైదరాబాద్-మంచిర్యాల మధ్య కొత్త రోడ్డు వేయాలి
- కేంద్ర మంత్రి గడ్కరీకి సీఎం రేవంత్ వినతి
- 868 కోట్ల పనులకు వారంలో అనుమతిస్తాం.. కొత్త రోడ్లపై చర్చకు అధికారుల్ని పంపుతా: గడ్కరీ



న్యూఢిల్లీ

భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్టు వరకు 12 వరుసల గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని ఉపరితల రవాణా మంత్రి నితిన్ గడ్కరీకి సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకా రం తెలంగాణ–ఏపీ రాజధానుల మధ్య గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మించాల్సి ఉందని గుర్తుచేశారు. తెలంగాణకు సముద్రమార్గం లేనందున బందరు పోర్టు వరకు సరకు రవాణాకు వీలుగా గ్రీన్‌ఫీల్డ్ రహదారి మంజూరు చేయాలని కోరారు. ఈ రహదారిలో 118 కిలోమీటర్లు తెలంగాణలో ఉంటుందని మిగతా భాగం ఏపీలో ఉంటుందని వివరించారు. - మిగతా2లో

## ఎన్డీయేది నైతికంగా పరాజయమే

- ఉప రాష్ట్రపతి ఎన్నిక ఫలితంపై ఖర్గే
- ఇది కేవలం ఎన్నిక మాత్రమే కాదు
- అంతకుమించిన సైద్ధాంతిక యుద్ధం
- ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన సీపీ రాధాకృష్ణన్‌కు శుభాకాంక్షలు

3



# పాలేరు నియోజకవర్గ చిన్నారులకు పీఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా ఉచిత షూస్ పంపిణీ

**మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సూచనల మేరకు సేవా కార్యక్రమానికి శ్రీకారం**

**కూసుమంచి మండలంలోని 62 పాఠశాలల్లో 1700 జతల షూస్ పంపిణీ**

**ఖమ్మం జిల్లా ప్రతినిధి ఆర్ రమేష్ అక్షర రేఖ న్యూస్ సెప్టెంబర్ 9** కూసుమంచి/ఖమ్మం పాలేరు నియోజకవర్గంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న చిన్నారులకు ఉచితంగా షూస్ పంపిణీ కార్యక్రమానికి రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సూచనల మేరకు పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ శ్రీకారం చుట్టింది. మంగళవారం కూసుమంచి మండలం నరసింహులగూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మంత్రి స్వయంగా 1 నుంచి 5వ తరగతి చదువుతున్న బాలబాలికలకు షూస్ అందజేశారు. మిగిలిన ప్రాంతాల్లో ఆయా ప్రాంతాల కాంగ్రెస్ పార్టీ నాయకులు పంపిణీ నిర్వహించారు. కూసుమంచి మండలంలోని 62 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 1700 జతల షూస్ పంపిణీ చేశారు. కొత్త షూస్ అందుకున్న చిన్నారులు ఆనందంతో కళకళలాడారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు మాట్లాడుతూ " మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఎల్లప్పుడూ పేదల అంటే మక్కువ చూపే నాయకుడు. ఆయన సూచనల మేరకు పీఎస్ఆర్ ట్రస్ట్ తీసుకుంటున్న ఈ తరహా చర్యలు చిన్నారుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తాయి. ఒక చిన్న అవసరాన్ని తీర్చడం ద్వారా పిల్లల్లో చదువుపై ఆసక్తి పెంచడం మంత్రి ప్రత్యేకత". తల్లిదండ్రులకు వ్యయ భారాన్ని తగ్గించడంలో,



చిన్నారులకు సౌకర్యం కల్పించడంలో పెద్ద సహాయం. ఇలాంటి సేవా చర్యలు మరిన్ని జరగాలని ఆశిస్తున్నాం" అని పేర్కొన్నారు.

## జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఓటర్ల జాబితాను పరిశీలించిన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు,విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి..



**ఖమ్మం జిల్లా ప్రతినిధి ఆర్ రమేష్ అక్షర రేఖ న్యూస్ సెప్టెంబర్ 9** జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల నేపథ్యంలో వెంగళరావు నగర్ పరిధిలోని ఓటర్ల జాబితాను రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు,విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు..అనంతరం ఓటర్ల జాబితా వెరిఫికేషన్,మరియు బూత్ స్థాయి కమిటీ సభ్యులతో పలు అంశాలపై చర్చించారు.

## లంబాడాలపై కుట్రలు సరైనవి కాదు




**రఘునాథపల్లి /అక్షర రేఖ) అక్టోబర్9** లంబాడా జేఏసీ జనగామ జిల్లా కన్వీనర్ కొర్ర రాజేందర్ నాయక్ ఆధ్వర్యంలో రఘునాథపల్లిలో శాంతిరాలిని నిర్వహించి వరంగల్ లో జరిగే శాంతి ర్యాలీకీ బయలుదేరిన మండల బంజారా నాయకులు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బిక్షపతి నాయక్, మండల నాయకులు కొమురెల్లి నాయక్, కొర్ర బిచ్చ నాయక్, తిరుపతి నాయక్, హరి నాయక్, సంతోష్ నాయక్, ఈర్య నాయక్, సేవ్యా నాయక్, జీత్మాల్ నాయక్, గణేష్ నాయక్, మరియు బంజారా ప్రజా ప్రతినిధులు యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## అభిప్రాయ సేకరణ బ్యాలెట్ ఓటింగ్‌లో పాల్గొనండి

**సొంతింటి కల సాధన ఐక్య పోరాటాల ద్వారానే సాధ్యం**

**సీఐటీయూ ఏరియా సెక్రటరీ ప్రవీణ్ కుమార్**



**అక్షర రేఖ మంథని/పెద్దపల్లి, సెప్టెంబర్ 9(జిల్లా ప్రతినిధి నాగండ్ల రవి కుమార్):** పెద్దపల్లి జిల్లా రామగుండం ఆర్జీ 2 ఏరియా వర్క్‌షాప్‌లో ఉపాధ్యక్షుడు వెంకన్న ఆధ్వర్యంలో కార్మిక సంఘం సీఐటీయూ గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా సెక్రటరీ కుంట ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ "ఈరోజు వరకు కార్మికులు అనుభవిస్తున్న హక్కులన్నీ పోరాటాల ద్వారానే సాధించబడ్డాయి. సింగరేణి కార్మికులందరికీ సొంతింటి కల సాధన కోసం గత నాలుగేళ్లుగా సీఐటీయూ అనేక నిరసనలు, పోరాటాలు నిర్వహిస్తోంది. ఐక్యపోరాటాల ద్వారానే ఈ కల నెరవేరుతుంది. ఎలక్షన్లలో మాత్రమే యూనియన్లు వేర్వేరుగా పోటీ పడతాయి. కానీ కార్మికులకు లాభం చేకూరే విషయాల్లో అన్ని యూనియన్లు, కార్మికులు కలిసిరావాలి. కార్మిక సమస్యల పరిష్కారానికై సీఐటీయూ ఐక్య కృషి కొనసాగిస్తూనే ఉంటుంది" అని తెలిపారు. అలాగే, సెప్టెంబర్ 11, 12 తేదీల్లో జరగనున్న బ్యాలెట్ ఓటింగ్‌లో ప్రతీ కార్మికుడు తప్పనిసరిగా పాల్గొనాలని, సెప్టెంబర్ 15న జీఎం ఆఫీస్ ముందు జరగనున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ మంద భూమయ్య, నర్ర సాంబరావ్, తిరుపతి, వినేష్, శ్రావణ్, శివకుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక శాఖ మంత్రి వివేక వెంకటస్వామి ని కలిసిన కార్మిక సంఘం నాయకులు

**రఘునాథపల్లి / అక్షర రేఖ) సెప్టెంబర్:9** టిబిఎన్ఆర్ కేస్ భవన నిర్మాణం గల కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దరిపల్లి చంద్రన్న ఆధ్వర్యంలో హైదరాబాదులో మన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రిని వివేక్ వెంకటస్వామి నీ కలవడం జరిగింది, మొన్న అసెంబ్లీ సమావేశాల్లో కార్మికుల ఇన్సూరెన్స్ ప్రమాద శాతం మరణించిన కార్మికునికి ఆరు లక్షల 30000 ఇచ్చేవారు అవి 10 లక్షలకు పెంచినారు అదేవిధంగా సహజ మరణానికి లక్ష 30 వేల రూపాయలు ఇచ్చేది రెండు లక్షల రూపాయలు పెంచడం జరిగింది అంగవైకల్ అయిన కార్మికునికి రెండు లక్షల 50 వేల నుండి ఐదు లక్షలు పెంచడం జరిగింది కార్మికులను ఆదుకున్నది అంటే కాంగ్రెస్ ప్రభుత్వం అని ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు రాష్ట్రవ్యాప్తంగా పాలాభిషేకం చేయడం జరిగింది ఇంకా కొన్ని సంక్షేమ పథకాలు అమలు చేయాలని కార్మిక శాఖ మంత్రిని కలవడం జరిగింది వారికి శాలువతో సన్మానించడం జరిగింది ఈ నాలుగు అంశాలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోతానని కార్మిక శాఖ మంత్రివర్యులు వివేక్ వెంకటస్వామి మాటి ఇవ్వడం జరిగింది. 55 సంవత్సరాలు దాటిన కార్మికునికి 5000 రూపాయలు పింఛను సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుకుంటున్నాం 58 సంవత్సరాలు దాటిన కార్మికునికి లేబర్ కార్డు తొలగిస్తుంది కాబట్టి అదే కాదు శాశ్వతంగా పనిచేయాలని చెప్పి ప్రభుత్వాన్ని కోరుకుంటున్నాం ప్రతి జిల్లాకు ఈఎస్ ఐ హాస్పిటల్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుకుంటున్నాం వెల్ఫేర్ బోర్డుకు గత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పుడు బోర్డుకు చైర్మన్ ఉన్నాడు ఇప్పటికి 15



సంవత్సరాలు అయితుంది కాబట్టి వెల్ఫేర్ బోర్డుకు చైర్మన్ నియమించాలి మా రాష్ట్ర అధ్యక్షుని దరిపెల్లి చంద్ర అన్నను చైర్మన్ చేయాలని తెలంగాణ వ్యాప్తంగా 14 రంగాల కార్మికులు కోరుకుంటున్నారు ఈ యొక్క కార్యక్రమానికి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చెలిమెల రాములు రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారి గంగాధర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిన్నారపు మహేందర్ రాష్ట్ర కార్యదర్శి రాస మల్ల కొమురయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు బషీకే దశరథం, రాష్ట్ర ప్రచార కార్యదర్శి నల్ల స్వామి, హన్మకొండ జిల్లా అధ్యక్షులు ఎండీ సాధిక్, జనగామ జిల్లా అధ్యక్షులు తుడి అంజయ్య ఉపాధ్యక్షులు అమరోజి బాబన్న జిల్లా ప్రధాన కార్యదర్శి ఇల్లెందుల బిక్షపతి జిల్లా కార్యదర్శి కుంటి భీమయ్య జిల్లా ప్రచార కార్యదర్శి చింతజోజి ఈరోజు కార్యక్రమాలు జనగామ జిల్లా రఘునాథ్ పల్లి మండలం నిలుగొండ గ్రామ అధ్యక్షులు తిప్పారు ప్రకాష్, ఉపాధ్యక్షులు తిప్పారం జేమ్స్ మండల కార్యదర్శి సింగపురంబిక్షపతిమండల ప్రచార కార్యదర్శి మేకల యాదగిరి తూడి శంకర్ తూడి ఓ దే లు చింత నర్సయ్య బీరు యాదగిరి దేవర వీరయ్య తూడి బుచ్చయ్య గడ్డం స్వామి పిట్టల పిచ్చయ్య తదితర కార్మికులు పాల్గొన్నారు

## సత్తా చాటినగురుకుల డిగ్రీ విద్యార్థులు







**జనగామ జిల్లా/ అక్షర రేఖ) సెప్టెంబర్9** పెంబర్తిలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలోని ఏడుగురు విద్యార్థులు సత్తా చాటారు. ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహించిన కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రన్స్ టెస్ట్ లో ఎంపికయ్యి సీట్లు సాధించారు. ఇందులో భాగంగా ఎ. తిరుమల కామర్స్ సబ్జెక్టులో మొదటి ర్యాంక్ సాధించడం విశేషం. కామర్స్ లోనే జె. నందిని మూడవ ర్యాంకు, ఎస్. రష్మిత కూడా సీట్లు సాధించి ప్రతిభ కనపరిచారు. తెలుగు సబ్జెక్టులో ఎన్. రవళి మరియు పి. శివలీల ఎంపికవ్వగా కెమిస్ట్రీ లో కె. సంధ్యారాణి, బిపిఇడిలో ఎ. అఖిల యూనివర్సిటీలో సీట్లు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. భాగ్య లక్ష్మి మాట్లాడుతూ విద్యార్థుల కోసం ప్రత్యేక శిక్షణా తరగతులు ఏర్పాటు చేశామని అందులో భాగంగానే మా కళాశాలలోని విద్యార్థులు పలు యూనివర్సిటీలకు ఎంపిక కావడం ఆనందంగా ఉందని ఈ సందర్భంగా సెంట్రల్ యూనివర్సిటీకి ఎంపికయినా రమ్య, శ్రావణి స్టేట్ యూనివర్సిటీలకు ఎంపికయినా విద్యార్థులను అభినందించడంతో పాటు విద్యార్థుల అభివృద్ధికై కృషి చేసిన అధ్యాపక బృందం కామర్స్ విభాగం అధ్యాపకులు రమ్య, స్నేహ తెలుగు విభాగం ఇంద్ర జ్యోతి, కెమిస్ట్రీ విభాగం శ్రీవాణి, పీడీ శిరీష మరియు అధ్యాపక బృందంను కళాశాల ప్రిన్సిపాల్ డా. కె భాగ్య లక్ష్మి అభినందించారు. పెంబర్తి లోని గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో అనుభవం గల అధ్యాపక బృందం, సువిశాల భవనం, ఆహ్లాదకర వాతావరణం మరియు తెలంగాణ ప్రభుత్వం అందించే అన్ని రకాల వసతులను అర్హతగల విద్యార్థులు వినియోగించుకోవాలని ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి విజ్ఞప్తి చేశారు.

## తల్లి మనకు జన్మనిస్తుంది పెంచిన చెట్టు నీడనిస్తుంది

**ఏక్ పెడ్ మా కే నామ్**

**ఒక్కో ఉద్యోగి ఒక్కో చెట్టు**



**అక్షర రేఖ న్యూస్, సెప్టెంబర్ 09, సిద్దిపేట ప్రతినిధి.** 'ఏక్ పెడ్ మా కే నామ్' ప్రచారంలో భాగంగా ఈరోజు సిద్దిపేట పట్టణంలో అన్ని వార్డులలో మరియు ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలలో పెద్ద ఎత్తున మొక్కలను నాటడం జరిగింది. ఇందులో భాగంగా ఎల్లమ్మ దేవాలయం పక్కన ఉన్నటువంటి వెంచర్ లో కమిషనర్ అశ్రిత్ కుమార్ గారు మున్సిపల్ సిబ్బంది తో మొక్కలను నాటడం జరిగింది. ఒక్కొక్కో ఉద్యోగి ఒక మొక్క నాటాలన్న గౌ. కలెక్టర్ గారి ఆదేశాలమేరకు పట్టణంలోని అన్ని వార్డులలో మున్సిపల్ ఉద్యోగులు ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటడం జరిగింది. నేడు సిద్దిపేట పట్టణంలో దాదాపు 2000 కు పైగా మొక్కలు నాటడం జరిగిందని నాటిన ప్రతి ఒక్క మొక్కను అందరం సంరక్షించుకుందామని తల్లి మనకు జన్మనిస్తే పెంచిన చెట్టు నీడనిస్తుందని కావున ప్రతి మొక్కను సంరక్షించాలని సూచించారు. చెట్లను మనం కాపాడితే అవి పర్యావరణం, వాతావరణం, మానవ ఆరోగ్యం మరియు జీవవైవిధ్యాన్ని కాపాడుతాయన్నారు. చెట్లు కిరణజన్య సంయోగక్రియ ద్వారా కార్బన్ డయాక్సైడ్‌ను గ్రహించి ఆక్సిజన్‌ను విడుదల చేయటం, గాలి నాణ్యతను మెరుగుపరచటం, ఉష్ణోగ్రతలను తగ్గించి, నేల క్షయాన్ని నివారిస్తాయనీ, నీటి సంరక్షణకు సహాయపడటం మరియు అనేక జీవులకు ఆవాసాన్ని కల్పిస్తాయన్నారు. ఒక ఉద్యోగి ఒక మొక్క నాటాలన్న గౌరవ జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది ప్రతి ఒక్కరు కూడా ఒక మొక్కను నాటి గ్లోబల్ పొజిషన్ సిస్టం ద్వారా ఫోటోలను దిగి అఫీషియల్ మరియు వ్యక్తిగత సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం జరిగిందన్నారు. నాటిన ప్రతి ఒక్క మొక్కను సంరక్షించే బాధ్యత మన అందరిపై ఉందని సూచించారు. ఇప్పటికే సిద్దిపేట పట్టణమంతా కూడా పచ్చదనంతో ఉందని అందరం కలిసి హరిత సిద్దిపేటగా తీర్చిదిదుకుందామన్నారు.

## శ్రీశ్రీశ్రీ దక్ష ప్రజాపతి శాలివాహన సొసైటీ మరియు శాలివాహన వెల్ఫేర్ ట్రస్ట్ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా మొగలిచెర్ల భద్రయ్య కి సన్మాన సత్కారం



**ఖమ్మం జిల్లా ప్రతినిధి ఆర్ రమేష్ అక్షర రేఖ న్యూస్ సెప్టెంబర్ 9** ఈరోజు అనగా 09/09/2025న సాయంత్రం 08:00 గంటలకు మయూరి సెంటర్లో గల ఎస్. వి కంటి ఆసుపత్రి నందు శ్రీశ్రీశ్రీ దక్ష ప్రజాపతి శాలివాహన సొసైటీ మరియు శాలివాహన వెల్ఫేర్ ట్రస్ట్ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శాలివాహన వెల్ఫేర్ ట్రస్ట్ సభ్యులు మొగిలిచర్ల భద్రయ్య , ఎల్ఐసి ఏజెంట్గా ఎన్నో సంవత్సరాలుగా సేవలు అందిస్తూ, ఒకే రోజులో అత్యధిక పాలసీలు చేసి గిన్నిస్ రికార్డు సాధించిన వారిలో ఒకరైన భద్రయ్య ని గుర్తించి ఈ సన్మాన సత్కార కార్యక్రమం నిర్వహించామని సొసైటీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సన్మాన గ్రహీత శాలివాహన వెల్ఫేర్ ట్రస్ట్ సభ్యులు మొగలిచెర్ల భద్రయ్య, శాలివాహన వెల్ఫేర్ ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు కానుగుల రాధాకృష్ణ, శాలివాహన వెల్ఫేర్ ట్రస్ట్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు విద్యాసంస్థల అధినేత డా౹౹ దరిపల్లి కిరణ్, శ్రీశ్రీశ్రీ దక్ష ప్రజాపతి శాలివాహన సొసైటీ అధ్యక్షులు తిగుళ్ళ వెంకటరమణ, ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి మొగ్లిచర్ల వెంకటేష్, ట్రస్ట్ యువత రాచర్ల రాజు, సమన్వయ కర్త సర్వేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి గుమ్మిడెల్లి సైధరావు, ప్రసార కార్యదర్శి దరిపల్లి భాస్కర్, మీడియా విభాగం శాతురాజుపల్లి చందు, వంగూరి ఈశ్వరి, ఉత్తేజ్ మరియు ప్రముఖులు పాల్గొని బద్రయ్య కృషిని, సాధనను అభినందించారు.

## కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువ నాయకుడు సైనికుడు తుమ్మల ప్రజల కోసం నిస్వార్థంగా కృషి చేస్తూ,

**సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ ముందుండే వ్యక్తి**

**డాక్టర్ శ్రీ తుమ్మల యుగంధర్**



**ఖమ్మం జిల్లా ప్రతినిధి ఆర్ రమేష్ అక్షర రేఖ న్యూస్ సెప్టెంబర్ 9** సామాజిక సేవలోనే తన జీవితాన్ని అంకితం చేసి, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు ఏ రంగంలోనైనా ప్రజలకు అండగా నిలుస్తూ, ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేశారు. సమస్యల పరిష్కారం చేస్తున్న నేటి యువతరం రాష్ట్ర యువ నాయకుడు కాంగ్రెస్ పార్టీ ప్రజా నాయకుడు అలుపెరగని నాయక తుమ్మల యుగేందర్ ప్రజల్లో అంతగా మెప్పు పొందినారు అన్న అంటే ఎమ్మటే స్పందిస్తున్న నేటి యువ కెరటం రాష్ట్ర యువ నాయకుడ .యువతకు ప్రేరణ, ప్రజలకు ఆదరణగా నిలుస్తూ, రాజకీయాల్లో కొత్త ఆశాజ్యోతిగా ముందుకు సాగుతున్నారు. శ్రీ తుమ్మల యుగంధర్ మంచి మనసుతో మంచి ఆలోచనతో ప్రజలు బాధపడకూడదు అని ప్రజల కోసం నిరంతరం ఎక్కడ ఇబ్బంది ఉందంటే అక్కడికి ముందుగా వెళ్లి వారి సమస్యలు తెలుసుకొని తక్షణమే తీరుస్తున్న తుమ్మల యుగేందర్ మనసు పూర్తిగా అభినందనలు తెలియజేస్తూ మాల మహానాడు ఖమ్మం జిల్లా అధ్యక్షుడు కొప్పుల రామారావు జై భీమ్ జై అంబేద్కర్ జై యుగేందర్

## ఇంటింటికి బీజేపీ రాష్ట్ర నాయకులు



**రఘునాథపల్లి/ అక్షర రేఖ) సెప్టెంబర్9** రఘునాథపల్లి మండలంలో జిల్లా అధ్యక్షులు సౌడ రమేష్ పిలుపుమేరకు మండల అధ్యక్షులు పుప్పాల వేణుకుమార్ ఆధ్వర్యంలో ప్రవాస్ యోజన (పల్లె పల్లెకు బిజెపి)అనే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి జిల్లా కార్యదర్శి చౌదర్పల్లి సతీష్ గారు జడ్పిటిసి ఎన్నికల ఇన్చార్జి పెరుమాండ్ల వెంకటేష్ రావడం జరిగింది. అశ్వరావు పల్లి గ్రామంలో శక్తి కేంద్ర మీటింగ్ మరియు ఇంటింటి ప్రచారం చేయడం జరిగింది. జాఫర్ గూడెం గ్రామంలో ఇంటింటికి ప్రచారం చేస్తూ అర్హులైన వారికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వకపోవడంపై మాట్లాడడం జరిగింది. ఖిలాషాపురం గ్రామంలో దేవాలయంలో పూజలు చేయడం జరిగింది.మరియు చాయ్ పై చర్చ నిర్వహించడం జరిగింది. మండలగూడెంలో ఇంటింటికి ప్రచారం చేయడం జరిగింది మరియు మహిళా సంఘాలతో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై చర్చించడం జరిగింది. లక్ష్మి తండాలో ఇంటింటి ప్రచారం చేయడం జరిగింది. ఫతేషాపూర్ లో ఇంటింటి ప్రచారం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు కావటి ముత్యాలు, ఓబిసి మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ద్యావర రాజు, మండల ప్రధాన కార్యదర్శులు ఉడుత రంజిత్ యాదవ్, తుమ్మలపల్లి సోమేశ్వర్, మండల ఉపాధ్యక్షులు గాదె ఉపేందర్, దైతల రంజిత్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కీర్తి వెంకటేశ్వర్లు, బీజేవైఎం జిల్లా కార్యదర్శి బోళ్ల అఖిల్, బీజేవైఎం మండల అధ్యక్షులు బోల్ల రాజ్ కుమార్,బూత్ అధ్యక్షులు గుర్రం జంపి, దుడుక సాయి తేజ, తాడూరి అజయ్, ప్రవీణ్,కావటి రవికుమార్,సీనియర్ నాయకులు యామంకి కమలాకర్, శ్రావణ్, రాజు,మెతుకు సాయికృష్ణ, వివిధ గ్రామాల నాయకులు పాల్గొనడం జరిగింది.

## రాష్ట్ర కార్యదర్శి నియమించబడిన శ్రీ.కొప్పు భాష



**అక్షర రేఖ న్యూస్( ప్రతినిధి) యాచారం** సెప్టెంబర్ 9. 9 .2025 రంగారెడ్డి జిల్లా యాచారం మండలం నుండి తెలంగాణ బిజెపి రాష్ట్ర కార్యదర్శిగా నిన్న నియమించబడిన శ్రీ కాపు భాషా గారిని వారి నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన బిజెపి నాయకులు, కార్యకర్తలు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి కొప్పు భాష గారు మాట్లాడుతూ సీనియర్ నాయకులు ఆశీస్సులతో మరియు నాయకుల కార్యకర్తలు పని చేయడం వల్ల ఈ రోజు నేను ఈ స్థాయిలో ఉన్నానని గర్వంగా చెప్పుకున్నాడు. వచ్చే ఎన్నికల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో మీ అందరి గెలుపు గురించి కష్టపడతారని అన్నారు. ఇట్టి కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు మేకల యాదగిరి రెడ్డి గారు. గోగి కార్ రమేష్ గారు. గొల్లపల్లి జంగయ్య గౌడ్ గారు. పగడాల శ్రీశైలం. మాజీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ గారు. ఉపాధ్యక్షులు పతి రాజుగారు. గౌరవ లక్ష్మణ్ గారు. ప్రధాన కార్యదర్శి నడికుడి కృష్ణ బోర్డు భాష గారు. అధికార ప్రతినిధి సాట్ మల్లేష్. ఓబీసీ మోర్చా. ఎస్టి మోర్చా మండల అధ్యక్షులు మల్లపు నరేష్ గారు. . సభావత్ గణేష్ నాయక్. తో పాటు వివిధ గ్రామాల నుండి వచ్చిన నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళలా ప్రభుత్వ పాలన

రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి

లికాటమయ్య రక్షక కిట్లను గీత కార్మికులు వినియోగించాలి

లిఅర్హులందరికీ విడతల వారిగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు

లికూసుమంచి మండలంలో అభివృద్ధి పనుల శంఖుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసి, క్యాంపు కార్యాలయంలో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, కాటమయ్య కిట్లను ఇందిరమ్మ మహిళా శక్తి పథకం క్రింద క్రిస్టియన్ లకు కుట్టు మిషన్లు పంపిణీ చేసిన మంత్రి పొంగులేటి

**ఖమ్మం జిల్లా ప్రతినిధి ఆర్ రమేష్ అక్షర రేఖ న్యూస్ సెప్టెంబర్ 9** అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళలా ఇందిరమ్మ ప్రభుత్వ పాలన సాగుతోందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం పాలేరు నియోజకవర్గంలో మంత్రి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ తో కలిసి పర్యటించి, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. పర్యటనలో భాగంగా కూసుమంచి మండలంలోని నాయకన్ గూడెం గ్రామంలో రూ. 20 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ నూతన భవనాన్ని ప్రారంభించారు. నర్సింహులగూడెం గ్రామంలో కిష్టాపురం నుండి నర్సింహులగూడెం వరకు రూ. 1.33 కోట్ల రూపాయలతో చేపట్టనున్న బిటి రోడ్డు నిర్మాణ పనులకు, కిష్టాపురం నుండి పోచారం వరకు రూ. 1.61 కోట్ల రూపాయలతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, కిష్టాపురం నుంచి ముత్యాలగూడెం వరకు రూ. 2.40 కోట్ల రూపాయలతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. జుజ్జులరావుపేట గ్రామంలో రూ. 88 లక్షలతో జుజ్జులరావుపేట ఆర్ అండ్ బి రోడ్డు నుండి మల్లాయిగూడెం పిఆర్ రోడ్ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కిష్టాపురం గ్రామంలో నిర్మాణంలో ఉన్న మామిడి నాగమ్మ ఇందిరమ్మ ఇంటిని మంత్రి పరిశీలించారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా, ఇసుక ఇస్తున్నారా, మొదటి విడత లక్ష రూపాయలు జమ అయ్యాయా అని లబ్ధిదారుని అడిగి తెలుసుకున్నారు. నిర్మాణం పూర్తయి క్రమంలో విడతల వారిగా 5 లక్షలు ప్రభుత్వం అందజేస్తుందని అన్నారు. కూసుమంచి జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు. కూసుమంచి తహసిల్దార్ కార్యాలయంలో శాండ్ బజార్ ను ప్రారంభించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు తక్కువ ధరకే ఇసుక అందించాలని సదుద్దేశంతో ఒక టన్ను గోదావరి ఇసుకను రూ. 1100 కే అందించనున్నట్లు మంత్రి తెలిపారు. స్థానికులకు ఇతర అవసరాలకు టన్ను ఇసుక రూ. 1300కి విక్రయించడం జరుగుతుందని అన్నారు. ఎక్కడా తప్పులు జరగకుండా అధికారులు పనిచేయాలని, చిన్న తప్పు జరిగిన ఉపేక్షించేది లేదని మంత్రి అన్నారు. కూసుమంచిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నేలకొండపల్లి మండలంలో 42, ఖమ్మం రూరల్ మండలంలో 82 మొత్తం 124 మంది లబ్ధిదారులకు కాటమయ్య రక్ష కిట్లు పంపిణీ, కూసుమంచి మండలానికి చెందిన 18 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ, పాలేరు నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన 20 మంది క్రైస్తవ మహిళా లబ్ధిదారులకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగలేకపోయిన ఎన్నికల సమయంలో ఇచ్చిన



హామీలను అమలు చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం ఎనిమిది లక్షల పందొమ్మిది వేల కోట్ల అప్పు రాష్ట్రంపై మోపిందని తెలిపారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా, 500 రూపాయల గ్యాస్ సిలిండర్, ఉచిత బస్సు ప్రయాణం వంటి కార్యక్రమాల ద్వారా మహిళలకు భరోసా కల్పించామని అన్నారు. రైతులకు మద్దతుగా 21 వేల కోట్లతో 2 లక్షల వరకు పంట రుణమాఫీ, 9 రోజులలో 9 వేల కోట్ల రైతు భరోసా నిధులు జమ, క్వింటా సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ వంటి కార్యక్రమాలను అమలు చేశామని అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేందర్ రెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, జిల్లా మైనారిటీ అభివృద్ధి అధికారి, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, ఆర్ అండ్ బి ఇఇ పవార్, డివిజనల్ పంచాయతీ అధికారి రాంబాబు, కూసుమంచి మండల తహసీల్దార్ రవికుమార్, మండల వ్యవసాయ అధికారిణి వాణి, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు.

## గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని పురస్కరించుకుని జగిత్యాల పోలీస్ శాఖ వారికి గణేష్ ఉత్సవ సమితి మరియు విశ్వహిందూ పరిషత్ నాయకుల సన్మానం



**జగిత్యాల జిల్లా సెప్టెంబర్.9 అక్షర రేఖ న్యూస్** గణేష్ నవరాత్రులను పురస్కరించుకొని జగిత్యాల పట్టణంలో రెండు రోజుల పాటు జరిగిన గణేష్ నిమజ్జన కార్యక్రమాలు శాంతియుతంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రత కల్పించిన పోలీస్ శాఖకు గణేష్ ఉత్సవ సమితి విశ్వహిందూ పరిషత్ తరుపున కృతజ్ఞతలు తెలియజేస్తూ జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ గారికి , డిఎస్పి రఘు చందర్ గారిని మరియు పట్టణం సి ఐ కరుణాకర్ గారికి , పట్టణ ఎస్ ఐ కుమారస్వామి, రాజుకిరణ్, సుప్రియ, మల్లేశం గార్లకు సన్మానం చెయ్యడం జరిగింది ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి గౌరవ అధ్యక్షులు బోయిని పద్మాకర్ , అధ్యక్షుడు జిట్టవేణి అరుణ్ కుమార్ , కార్యదర్శి పరంధం , జిల్లా కోశాధికారి రాములు, జిల్లా సహా కార్యదర్శి సంతోష్ , భజరంగ్ దళ్ టౌన్ కన్వీనర్ పాదం మహేందర్ , ఉత్సవ సమితీ సభ్యులు , లింగంపేట శ్రీనివాస్, యాంకర్ సుధాకర్, ఠాగూర్ కిషోర్ సింగ్, అరవ లక్ష్మి , తదితరులు పాల్గొన్నారు

## ప్రాణహిత కాలనీలో ఎయిర్టెల్ టవర్ నిర్మాణం ఆపండి.



**మందమర్రి సెప్టెంబర్ 09 (అక్షర రేఖ) ప్రతినిధి.** మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం స్థానిక ప్రాణహిత కాలనీ లో నిర్మిస్తున్న ఎయిర్టెల్ టవర్ ని నిర్మాణం ఆపాలని కాలనీవాసులు నిరసన వ్యక్తం చేశారు.ఇప్పటికే కాలనీకి దగ్గరగా ఉన్న సోలార్ ప్రాజెక్టు వల్ల కాలనీవాసులు వేడికి ఇబ్బంది పడుతున్నారని,ఇప్పుడు ఇలా అతి దగ్గరగా సెల్ టవర్ నిర్మించడం వల్ల పిల్లలు రేడియేషన్ కు గురై అనారోగ్యం పాలవుతారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ విషయమై ఇప్పటికే ఏరియా జిఎం గారికి విజ్ఞప్తి చేసిన పట్టించుకోవడంలేదని ఈ సెల్ టవర్ నిర్మాణం గురించి తమకు ఎలాంటి సమాచారం లేదని మున్సిపల్ అధికారులు అంటున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. కాలనీకి దూరంగా ఈ నిర్మాణాన్ని చేపట్టాలని డిమాండ్ చేశారు.

## పర్యావరణ పరిరక్షణ లో భాగంగా జిల్లాలో ఒక్కో ఉద్యోగి ఒక్కో మొక్క కార్యక్రమం గణంగా జరిగింది.



**అక్షర రేఖ న్యూస్, సెప్టెంబర్ 09, సిద్దిపేట ప్రతినిధి.** పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా జిల్లాలో ఒక్కో ఉద్యోగి ఒక్కో మొక్క కార్యక్రమం ద్వారా జిల్లా వ్యాప్తంగా 15వేల మొక్కలను నాటడం జరిగిందని జిల్లా కలెక్టర్ కే.హైమావతి తెలిపారు. పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ' ఏక్ పేడ్ మా కే నామ్' స్ఫూర్తితో జిల్లా కలెక్టర్ ఆలోచన మేరకు సిద్దిపేట జిల్లాలోని ప్రతి ప్రభుత్వ ఉద్యోగి వారి తల్లి పేరు మీద ఒక మొక్కను నాటే వినూత్న కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ గరీమా అగ్రవాల్ పర్యవేక్షణలో గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా రూపకల్పన చేసి మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఒక్కో ఉద్యోగి ఒక్కో మొక్కను నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్, జిల్లా అదనపు కలెక్టర్ మరియు వివిధ శాఖల ఉద్యోగులు అందరు కలిసి జిల్లా అధికారుల నివాస గృహాల సముదాయం సమీపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్థలం వరకు ర్యాలీగా వచ్చి జిల్లా కలెక్టర్ తో సహా జిల్లా స్థాయి అధికారులు, ఇతర ఉద్యోగులు అందరూ ఒక్కో ఉద్యోగి ఒక్కొక్క మొక్క దగ్గరికి వెళ్లి మొక్కను నాటి సెల్ఫీ దిగి సోషల్ మీడియాలలో షేర్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మరియు జిల్లా అదనపు కలెక్టర్ సిద్దిపేట ఆక్సిజన్ పార్కులో ఒక్కో ఉద్యోగి ఒక్కో మొక్క కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కే.హైమావతి మాట్లాడుతూ జిల్లాలో వనమహోత్సవం కార్యక్రమం ద్వారా 22 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం పెట్టుకొని వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా 100 మొక్కలను నాటడం జరిగిందని అన్నారు. ప్రతి ఒక్క ఉద్యోగి కూడా సంతృప్తి చెందేలా వారి తల్లి పేరు మీద ఒక్కొక్క ఉద్యోగి ఒక మొక్కను నాటాలనే ఆలోచన మేరకు జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ గరీమ అగ్రవాల్ పర్యవేక్షణలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ద్వారా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా చేపట్టడం జరిగిందని ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగులందరూ మనస్ఫూర్తిగా ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లా పోలీస్ శాఖ తో సహా 15 వేల మొక్కలను ఒకే రోజు నాటడం జరిగిందని తెలిపారు. తల్లికి ఏమిచ్చినా తల్లి రుణం తీర్చుకోలేమని అందుకే తల్లి పేరు మీద మొక్కను నాటి వాటి సంరక్షణ బాధ్యతను ఆ ఉద్యోగి చూసుకోనున్నారని తెలిపారు. తల్లి తర్వాత భూమిని మాతతో పోలుస్తాము కాబట్టి మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములై భూమాత రుణాన్ని కూడా తీర్చుకునే అవకాశం ఇలా లభిస్తుందని తెలిపారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ గరీమా అగ్రవాల్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భూమాతకు సహకరించడంలో చిన్న ప్రయత్నం ఒక్క ఉద్యోగి ఒక్కో మొక్క నాటడం కార్యక్రమని ఈ కార్యక్రమంలో జిల్లాలోని జిల్లా స్థాయి నుండి గ్రామస్థాయి వరకు ప్రభుత్వ దీన్ని స్ఫూర్తితో ప్రజలందరూ కూడా మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, వివిధ శాఖల జిల్లా అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చేనేత కార్మికుల కొరకు ప్రత్యేక వైద్య శిబిరం




**జమ్మికుంట, సెప్టెంబర్ 9, అక్షర రేఖ :** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు మంగళవారం వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల జమ్మికుంట పట్టణంలోని షత్రంజి చేనేత సంఘంలో గల చేనేత కార్మికుల కొరకు వైద్యాధికారి డాక్టర్ వరుణ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య ఆరోగ్య శిబిరం, ఎన్సిడి క్యాంప్ ఏర్పాటు చేయడం జరిగింది. షత్రంజి చేనేత సంఘంలో గల 115 మంది చేనేత కార్మికులకు ఆరోగ్య పరీక్షలు, ఎన్సిడి పరీక్షలు నిర్వహించడం జరిగింది. ప్రభుత్వ పెన్షన్ తీసుకుంటున్న కార్మికులకు ఎన్సీడీ పరీక్షలు నిర్వహించడం జరిగింది. చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు ఉన్న చేనేత కార్మికులకు మందులు ఇవ్వడం జరిగింది. డాక్టర్ చందు డిప్యూటీ డిఎంహెచ్ఓ శిబిరాన్ని సందర్శించి చేనేత కార్మికులకు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ డిసీజెస్ (వర్షాకాలంలో సంభవించే వ్యాధులు) మీద డ్రై డే మీద అవగాహన కల్పించడం జరిగింది. బీపీ, షుగర్ మందులు ప్రభుత్వం అందించే మందులనే వాడాలని తద్వారా ఆర్థికంగా భారం తగ్గించుకోవచ్చు అని ప్రభుత్వ మందులు సమర్థవంతంగా పనిచేస్తాయని, ఆరోగ్య మహిళా కార్యక్రమం ప్రతి మంగళవారం, శుక్రవారం ఆరోగ్య ఉప కేంద్రాలలో జరుగుతుందని. మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరడం జరిగింది. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ వరుణ, డాక్టర్ మహోన్నత పటేల్, హెల్త్ ఎడ్యుకేటర్స్ మోహన్ రెడ్డి, పంజాల ప్రతాప్ గౌడ్, షత్రంజి చేనేత సంఘం అధ్యక్షుడు ఉడుత రమేష్, సూపర్వైజర్ అరుణ, ల్యాబ్ టెక్నీషియన్ రామకృష్ణ, నరేందర్ హెల్త్ అసిస్టెంట్, ఏఎన్ఎంలు మంజుల, రజిత, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అసిస్టెంట్ లైన్మెన్‌లకు ఘన సన్మానం



**అక్షర రేఖ గోదావరిఖని /పెద్దపల్లి, సెప్టెంబర్ 9(జిల్లా ప్రతినిధి నాగండ్ల రవి కుమార్):** విద్యుత్ సంస్థలో విజయవంతంగా ఆరు సంవత్సరాలు పూర్తి చేసుకున్న అసిస్టెంట్ లైన్మెన్‌లను బసంతనగర్ సెక్షన్ ఆఫీసు లో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అడిషనల్ అసిస్టెంట్ ఇంజనీర్ మానాల ప్రసాద్, సబ్ ఇంజనీర్ రాజ్‌కుమార్ హాజరై అసిస్టెంట్ లైన్మెన్‌లను అభినందించారు. ఈ సందర్భంగా మానాల ప్రసాద్ మాట్లాడుతూ "అసిస్టెంట్ లైన్మెన్‌ల కృషి, సేవాభావం, అంకితభావమే విద్యుత్ సంస్థకు బలమైన స్తంభాలు. వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా అందించడంలో మీ పాత్ర విశేషమైనది. ఈ సన్మానం మీకు మరింత ప్రేరణగా మారి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించడానికి దోహదపడాలి" అని పేర్కొన్నారు. అలాగే ఆయన, విద్యుత్ రంగంలో లైన్మెన్‌లు ఎదుర్కొనే సవాళ్లను గుర్తుచేసి, భద్రతా ప్రమాణాలు పాటిస్తూ ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎల్.ఐ. వెంకట్రాజం , ఎల్ఐలు నరసింహ, బాబన్న తదితరులు పాల్గొని అసిస్టెంట్ లైన్మెన్‌లకు అభినందనలు తెలిపారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా తెలంగాణ భాష దినోత్సవం

ఆలోచన జ్యోతి .కాళోజి

**అక్షర రేఖ గోదావరిఖని /పెద్దపల్లి, సెప్టెంబర్ 9(జిల్లా ప్రతినిధి నాగండ్ల రవి కుమార్):** ప్రజా కవి కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ భాష దినోత్సవాన్ని తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జై కిషన్ ఓఝూ అధ్యక్షత వహించగా, గోదావరిఖని పట్టణ కవి రచయిత రాకుమార ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన తన అమూల్యమైన సందేశాన్ని అందించి, కాళోజీ గారితో తనకు ఉన్న స్నేహానుబంధాన్ని, ఆయన చూపిన వాత్సల్యాన్ని స్మరించుకున్నారు. అలాగే తెలుగు నుడికారం, పలుకుబడులు, తెలంగాణ యాస, మాట పాట మధ్య వ్యత్యాసం గురించి విద్యార్థులకు సవివరంగా తెలియజేశారు. ప్రిన్సిపల్ ఆచార్య జై కిషన్ ఓఝూ మాట్లాడుతూ "పుట్టుక నీది, చావు నీది, బతుకంతా దేశానిది ఒక సిరా చుక్క లక్ష మెదళ్లకు కదలిక" వంటి కాళోజి గారి అమూల్యమైన పలుకుబడులను నెమరువేసుకున్నారు. బడి పలుకుల భాషకంటే పలుకుబడుల భాష కావాలని కోరిన కాళోజి, తెలంగాణ భాష మాధుర్యాన్ని స్పష్టంగా చూపించారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు భువనేశ్వరి, ముత్యాల శృతి, చైత్ర తదితరులు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. అనంతరం విద్యార్థులు ప్రిన్సిపల్‌తో పాటు ఇతర అధ్యాపకులను సన్మానించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు తెలుగు విభాగ




అధ్యాపకులు శ్రీమతి సమత, డా. సతీష్‌లను ప్రిన్సిపల్ ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రజా కవి కాళోజీ జయంతిని పండుగలా జరిపారు.

## కల్తీ వస్తువులపై వినియోగదారులకు అవగాహన కల్పిస్తాము

జిల్లా కన్స్యూమర్ ఫోరమ్ అధ్యక్షులు బాసంగారి వంశీధర్



**అక్షర రేఖ న్యూస్, సెప్టెంబర్ 09, సిద్దిపేట ప్రతినిధి.** జిల్లాలో కల్తీ వస్తువుల పట్ల వినియోగదారులకు అవగాహన కల్పిస్తామని, కల్తీ వస్తువుల నిర్మూలనపై పోరాడుతామని జిల్లా కన్స్యూమర్ ఫోరమ్ అధ్యక్షులు బాసంగారి వంశీధర్ పేర్కొన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా కన్స్యూమర్ ఫోరమ్ సమావేశాన్ని రాష్ట్ర అధ్యక్షులు అంబూ రాథోడ్, రాజేష్ ఖన్నా, వేణుగోపాల్ ఆదేశాల మేరకు రాష్ట్ర మీడియా ఇన్చార్జి పెంటం స్వామి ఆధ్వర్యంలో కొమురవెల్లి మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.జిల్లా అధ్యక్షులుగా బాసం గారి వంశీధర్ గౌరవ సలహాదారులుగా చిలుక మహేష్, జిల్లా ఉపాధ్యక్షులుగా వరయోగుల వెంకటేశ్వర స్వామి, జిల్లా ప్రధాన కారదర్శిగా అంబడిపల్లి ఈశ్వర్, జిల్లా ట్రెజరర్ గా యెదురు మోహన్ రెడ్డి, జిల్లా జాయింట్ సెక్రటరీగా కమాలాపురము శ్రీకాంత్ అలాగే డైరెక్టర్స్ గా పబ్బోజు ప్రశాంత్, మ్యాన సౌజన్య, ఆరేపల్లి భాస్కర్, సౌజన్య లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ... జిల్లాలో కన్స్యూమర్ ఫోరంను బలోపేతం చేస్తామన్నారు.

## జగిత్యాల లో 8వ రోజుకు చేరిన అష్టాదశ పురాణ జ్ఞాన యజ్ఞం



**జగిత్యాల టౌన్,సెప్టెంబర్ 9, అక్షర రేఖ న్యూస్** జగిత్యాల పట్టణంలోని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం గీత భవన్ లో ప్రముఖ పౌరానికులు మంచిర్యాల వాస్తవ్యులు బ్రహ్మశ్రీ బుర్ర భాస్కర శర్మ చే శ్రీమత్ అష్టాదశ పురాణ జ్ఞాన యజ్ఞం అట్టహాసంగా నిర్వహిస్తూన్నారు.18 పురాణాలను 18 రోజులపాటు రోజుకు ఒక పురాణం చొప్పున 18 రోజులపాటు చెప్ప నున్నట్లు ఆచార్యులు బుర్ర భాస్కర్ శర్మ తెలిపారు. నిర్వాహకులు గంప రజిని, నార్ల రజిని, పాత రాధ, ఈ ముగ్గురితోపాటు, ఇంకా కొందరు మహిళలు తోడై శ్రీమద్ అష్టాదశ పురాణ జ్ఞాన యజ్ఞం నడిపిస్తున్నారు.బుర్ర భాస్కర శర్మ పురాణాలను చెబుతూ ఉంటే, శ్రోతలు రోజుకు 8 గంటల పాటు మంత్ర ముగ్దులై పురాణాన్ని వినడం కనిపిస్తుంది. మాతలు భక్తులచే గీత భవన్ హాలు కిక్కిరిసిపోయింది.ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గంప రజిని,నార్ల రజిని,పాత రాద,సామాజిక కార్యకర్త తవుటు రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల పట్ల మీరు మీ కుటుంబ సభ్యులు అప్రమత్తంగా ఉండాలి

**అక్షర రేఖ న్యూస్, సెప్టెంబర్ 09, సిద్దిపేట ప్రతినిధి.** మానవ తప్పిదం, ఆశ/ భయము పేరుతో సైబర్ నేరాలు జరుగుతున్నాయి చెడు వ్యసనాలకు బానిసలు కావద్దు మత్తుతో చేసుకోకండి మీ జీవితం చిత్తు. విద్యార్థి దశ భవిష్యత్తుకు బంగారు బాట 16 సంవత్సరాల నుండి 25 సంవత్సరాల వరకు క్రమశిక్షణతో చదువుకుంటే బాగుపడతారు విద్యార్థి దశలో ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనలు పాటించడం నేర్చుకోవడం చాలా ముఖ్యం త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ విద్యాసాగర్ ఎన్సాన్ పల్లి గవర్నమెంట్ హై స్కూల్ విద్యార్థినీ విద్యార్థులకు సైబర్ నేరాలు, డ్రగ్స్ గంజాయి ఇతర మత్తు పదార్థాల గురించి, ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనల గురించి అవగాహన కల్పించిన త్రీటౌన్ ఇన్స్పెక్టర్ విద్యాసాగర్ ఈ సందర్భంగా త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల మీరు మీ కుటుంబ సభ్యులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు, మరియు బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోకూడదన్నారు. ప్రతి విద్యార్థి చదువు పై దృష్టి సారించాలని సూచించారు. చదువు కోవడం ద్వారా అనేక ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో విద్యను అభ్యసించే విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించి మంచి ఉద్యోగ అవకాశాలు అంది పోచుకోవడం జరుగుతుంది అన్నారు. చెడు వ్యసనాలకు అలవాట్లకు దూరంగా ఉండాలని అన్నారు. డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని డ్రగ్స్ సరఫరా చేసిన విక్రయించిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. గంజాయి డ్రగ్స్ ఇతర పదార్థాలకు దూరంగా ఉండాలని చదువుపై దృష్టి సారించి ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని ముందుకు సాగుతూ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని తెలిపారు. డ్రగ్స్ (మత్తు పదార్థాలు) వాడటం వల్ల ఆరోగ్యంపై, కుటుంబంపై, సామాజిక జీవితంపై, ఆర్థిక పరిస్థితులపై భారీ నష్టాలు జరిగే అవకాశం ఉంది. డ్రగ్స్ మూలంగా సమాజంలో జరుగుతున్న దుష్పరిణామాలను వివరిస్తూ మాధకద్రవ్యాల లను తరిమి కొట్టడానికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, యువత కూడా మాధకద్రవ్యాలకు దూరంగా ఉంటూ మాధకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని యువతకు పిలుపునిచ్చారు. విద్యార్థి దశలో ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనలు నేర్చుకోవడం చాలా ముఖ్యం,మానవ తప్పిదం వల్లే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి నాలుగు చక్రాల వాహనదారులు తప్పకుండా సీట్ బెల్ట్ ధరించాలి అధిక వేగాన్ని నియంత్రించడానికి స్పీడ్ లేజర్ గన్ ద్వారా కేసులు నమోదు చేయడం జరుగుతుంది, మైనర్లు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు నడపవద్దని సూచించారు, తల్లిదండ్రులు కూడా మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోడ్డు దాటేటప్పుడు రోడ్డుపై నడిచేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనలు పాటించి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. ఈ దశలో కష్టపడి చదివితే జీవితం బాగుపడుతుంది ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్మాస్టర్



షహనాజ్ సుల్తానా, మరియు ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఒక ఉద్యోగి ఒక మొక్క, ఏక్ పెడ్ మాకే నామ్ (తల్లి పేరున ఒక మొక్క) కార్యక్రమంలో భాగంగా పోలీస్ కమిషనర్ గారి ఆదేశానుసారం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటడం జరిగింది

## జగిత్యాల టౌన్ 3 సెక్షన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేత



**జగిత్యాల టౌన్, సెప్టెంబర్ 09, అక్షర రేఖ న్యూస్** జగిత్యాల పట్టణంలో నిరంతర విద్యుత్ సరఫరా చేయడంకై 11 కేవి గాంధీ నగర్ ఫీడర్ పై చెట్ల కొమ్మల తీసివేసే క్రమంలో తీన్ కని చౌరస్తా,పెద్ద మసీదు, కటికే వాడ ,మంచి నీళ్ళ బావి, ఇస్లాంపుర, గాంధీనగర్, తెనుగువాడ, దగ్గులమ్మ గుడి, ఉస్మాన్ పుర, మహబూబ్, రహ్మత్ పుర, జెండా మైల,ప్యారా బాయ్, గోరేమియా, ఖిలా గడ్డ తులసి నగర్ ఏరియాలో విద్యుత్ సరఫరా లో బుధవారం 2025 సెప్టెంబర్ 10 రోజున ఉదయం 9:30 గంటల నుండి 11:30 గంటల వరకు అంతరాయం ఏర్పడుతుంది. కావున వినియోగదారులు గమనించి సహకరించ గలరు అని డివిజనల్ ఇంజినీర్ కె. గంగారం తెలిపారు.

## ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు అందుకున్న రఘు

అభినందనలు తెలిపిన సుందిల్ల గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు



**అక్షర రేఖ మంథని/పెద్దపల్లి, సెప్టెంబర్ 9(జిల్లా ప్రతినిధి నాగండ్ల రవి కుమార్):** పెద్దపల్లి జిల్లా సుందిల్ల గ్రామంలోని మండల ప్రజా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయుడు రఘు, ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విశిష్టమైన సేవలకు గుర్తింపుగా ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు అందుకున్నారు. ఈ అవార్డును మండల అధికారులు రఘుకు అందజేశారు. విద్యారంగ అభివృద్ధి, విద్యార్థుల సమగ్ర వికాసం కోసం ఆయన చేసిన కృషి విశేషంగా నిలిచిందని ఈ సందర్భంగా ప్రశంసించారు. ఉపాధ్యాయుడు రఘు మాట్లాడుతూ – "ఈ అవార్డు నాకు మాత్రమే కాకుండా ప్రభుత్వ ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులందరికీ దక్కిన గౌరవం. విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో మరింత కృషి చేస్తాను" అని అన్నారు. ఈ అవార్డు లభించిన సందర్భంగా మండల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు రఘును ఘనంగా అభినందించారు.

## మెదక్ లో దూసుకొచ్చిన ఆర్టీసీ బస్సు

బైక్‌ను ఢీ.. వ్యక్తి గాయాలు..



మెదక్ జిల్లా ప్రతినిధి వెంకటేష్, సెప్టెంబర్ 09(అక్షర రేఖా న్యూస్):: ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ పట్టణానికి చెందిన రైతు పెంటయ్య ఫర్టిలైజర్ షాప్ కు వెళ్లి మోపెడ్ వాహనంపై తిరిగి వస్తుండగా రాందాస్ చౌరస్తా వద్ద వెనుక నుంచి వేగంగా, అజాగ్రత్తగా దూసుకువచ్చిన మెదక్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బలంగా ఢీ కొట్టింది. దాంతో పెంటయ్యకు గాయాలయ్యాయి. అంతేకాకుండా గాయపడిన వ్యక్తి పట్ల ఆర్టీసీ డ్రైవర్ స్వామి దురుసుగా ప్రవర్తించాడు.. ఇది గమనించిన స్థానికులు డ్రైవర్ ను మందలించారు. అక్కడే విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని.. పోలీస్ స్టేషన్ తరలించారు..

# దేశ ప్రజల గుండెకాయ మన రాజ్యాంగమే

మెజార్టీ ప్రజల శత్రువు మనువాదం

రాజ్యాంగ రక్షణ కోసం ఐక్యం కావాలి

కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

టీ.స్కైలాబ్ బాబు

**అలంపూర్, సెప్టెంబర్ 09(అక్షర రేఖ) :** ప్రతి మనిషికి ఒక గుండె ఉండటం సహజమేననీ, భారత ప్రజలందరి గుండెకాయగా ఉన్న భారత రాజ్యాంగాన్ని మనువాదుల నుండి రక్షించుకోవాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు పేర్కొన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా ఆలంపూర్ చౌరస్తా లోని విశ్వశాంతి డిగ్రీ కళాశాల న్యూ బిల్డింగ్ లో కేవీపీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం రాజ్యాంగం ఎదుర్కొంటున్న సవాళ్ళు అనే అంశంపై సెమినార్ నిర్వహించారు.కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు ఎ.పరంజ్యోతి సెమినార్ కు అధ్యక్షత వహించారు. ప్రధాన వక్తగా హాజరైన కేవీపీఎస్ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు మాట్లాడుతూ...భారత రాజ్యాంగం ఏర్పడి 75ఏళ్లు గడిచినప్పటికి ఆఫలాలు సంపన్నులకే చెందుతున్నాయని సామాన్యులకు దక్కడం లేదని చెప్పారు. దేశంలో 200 మంది కోటీశ్వరుల ఆస్తులు దేశంలో 40 శాతం మంది ప్రజల ఆస్తితో సమానంగా ఉందని, ఒక శాతం మంది చేతుల్లో 50 శాతం ఆస్తి పోగు పడిందన్నారు.ఆదాని ప్రపంచంలో 2వ కుబేరుడుగా ఎదిగాడని, కానీ దేశంలో దారిద్ర రేఖకు దిగువన 42 కోట్ల మంది ఉన్నారని పేర్కొన్నారు. 80 కోట్ల మంది రేషన్ బియ్యం కోసం ఎదురుచూస్తున్నారంటే దేశంలో పేదరికం ఎలా పెరిగిందో విధితమవుతుందన్నారు. బిజెపి 11 ఏళ్ల పాలన సామాజిక, ఆర్థిక అంతరాలను మరింతగా పెంచిందన్నారు. ఆదానికి ఆకాశం ఎత్తు ఆస్తులు కూడబెడితే, అత్యంత నిరుపేదలకు దరిద్రాన్ని కూడబెట్టిందన్నారు. కార్పొరేట్ పెట్టుబడిదారులకు లక్షల కోట్లరూపాయల రాయితీలు ఇస్తున్న ప్రభుత్వం, పేదలపై భారాలు మోపుతుందన్నారు. హిందూ, ముస్లిం, క్రైస్తవం ఏ మతం ప్రమాదంలో లేదన్నారు. ఆ మతాల ముసుగులో రాజకీయాలు చేస్తున్న మతోన్మాదుల వల్లే సామాన్య ప్రజలు ప్రమాదంలో ఉన్నారని చెప్పారు.రాజ్యాంగ హక్కులు కాలరాయటంతో రాజ్యాంగం ప్రమాదంలో పడిందన్నారు. రాజ్యాంగం ఏర్పడిన నాటి నుండి రాజ్యాంగాన్ని వ్యతిరేకించిన వాళ్లే నేడు కేంద్రంలో రాజ్యమేలుతున్నారని విమర్శించారు. మత విద్వేషాలు రెచ్చగొట్టడం ద్వారా మనుషుల మధ్య విభజన తీసుకువచ్చి అట్టడుగు పేదల హక్కులు కాలరాస్తుందన్నారు. మోడీ సర్కార్ హయాంలో దళితులపై దాడులు దౌర్జన్యాలు 300 రేట్లు పెరిగాయన్నారు.గత ఐదేళ్ల కాలంలో నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో అందించిన వివరాల ప్రకారం గత ఐదేళ్లలో 6,34 066 ఫిర్యాదులు నమోదు కాగా, బిజెపి పాలిత రాష్ట్రాల్లోనే అత్యధికంగా జరుగుతున్నాయని తెలిపారు.



ఒక్క ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోనే 3.4లక్షల దౌర్జన్యాలు జరిగాయన్నారు. దళితులపై గంటకు 14 దౌర్జన్యాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ చేయబడుతుందన్నారు. ప్రజాస్వామ్య విధంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కల్పించిన ఓటు హక్కును బీహార్ రాష్ట్రంలో 65 లక్షల మందిని ఓటుకు అనర్హుడుగా చేసిన ఘనత బిజెపిదేనని విమర్శించారు. సుప్రీంకోర్టు జోక్యంతో ఆధార్ కార్డు ఆధారంగా ఓటు హక్కు నమోదు చేయబడుతుందన్నారు. బీజేపీ పాలనలో ఉన్న మణిపూర్ లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగింపు చేశారని, వారే బజార్లలో భారత్ మాతాకీ జై అంటున్నారని విమర్శించారు. దేశంలో మహిళలకు భద్రత కలిగి ఉన్న రాష్ట్రాలలో భారతదేశం 135 స్థానంలో ఉందని చెప్పారు. ఎస్సి ఎస్టి సబ్ ప్లాన్ చట్టాన్ని నీరుగార్చారని, దళితులు గిరిజనులు బలహీన వర్గాలకు ప్రధాన ఉపాధి వనరుగా ఉన్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి నిధులు తగ్గించి పని దినాలు కల్పించడం లేదన్నారు. కోట్లాదిమంది కార్మికులకు స్వాతంత్రం కంటే ముందు నుంచి ఉన్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ లు తెచ్చి కార్పొరేట్ దిగ్గజాలకు దోచి పెడుతున్నారని విమర్శించారు. సామాజిక న్యాయం ప్రజాస్వామ్యం సెక్యులరిజం ఫెడరల్ వ్యవస్థలను దెబ్బతింటున్నాయని చెప్పారు. నిరుద్యోగుల ఆకాంక్షలు నెరవేర్చబడలేదని ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మాట నీటి మూటగా మారిందన్నారు. రాజ్యాంగ హక్కులను రక్షించుకోవడం ద్వారా భారత దేశ ప్రజలందరి గుండెకాయ లాగా ఉన్న భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలన్నారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు సాధన కోసం జరిగే ఉద్యమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. ఈ సెమినార్ లో విశ్వశాంతి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ మురళీధర్ రెడ్డి, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రాజు రాష్ట్ర కమిటీ సభ్యులు గట్టు మారెన్న, జిల్లా ఉపాధ్యక్షులు వెంకటస్వామి, విజయ్ కుమార్, ఏల్కూరు సవరన్న, జిల్లా కమిటి సభ్యులు రాజు, సుధాకర్, సంజీవ రాజు, నాగరాజు, మద్దిలేటి, నాయకులు సామేలు, నరసింహ, మౌలాలి, జయన్న, భాస్కర్ ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

# మెరుగు తిరుపతికి పితృవియోగం





పరామర్శించిన పలువురు ప్రముఖులు

**తరిగొప్పుల (అక్షర రేఖ) సెప్టెంబర్: 09** మండల కేంద్రంలోని ఈనాడు విలేకరి మెరుగు తిరుపతి తండ్రి మెరుగు ఎల్లయ్య గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతు మంగళవారం రోజున తుదిశ్వాస విడిచారు. ఇట్టి విషయం తెలుసుకున్న జనగామ నియోజకవర్గం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అర్జుల సుధాకర్ రెడ్డి, తరిగొప్పుల మండల బి ఆర్ ఎస్ అధ్యక్షులు పింగళి జగన్మోహన్ రెడ్డితో పలువురు ప్రముఖులు వారి స్వగృహంలో విలేకరి తిరుపతిని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహకారం అందించారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తిరుపతికి ఫోన్ చేసి మాట్లాడి పరామర్శించారు. పరామర్శించిన వారిలో అధికార ప్రతినిధి చిలువేరు లింగం, గ్రామ శాఖ అధ్యక్షులు అంకం రాజారాం, మాజి ఎంపీటీసీ చెన్నూరి సంజీవులు, మాజి సర్పంచ్ ప్రభుదాస్, బత్తిని సురేందర్, యాటెల్లి ఉప్పలయ్య, కథ టోనీ, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దామెర ప్రసాద్, తరిగొప్పుల కాంగ్రెస్ గ్రామ యూత్ అధ్యక్షులు దామెర మైఖల్, ఉదయ్ కిరణ్ తదితరులు పాల్గొని ఎల్లయ్య కుటుంబానికి అండగా ఉంటామని మనోధైర్యాన్ని ఇచ్చారు

## స్వచ్ఛ సర్వేక్షణ్ 2025లో రామగుండం ఉత్తమ ర్యాంకు సాధించాలి

వంద రోజుల కార్యాచరణలో భాగంగా వర్క్‌షాప్


అదనపు కలెక్టర్ మరియు కమిషనర్ జె. అరుణశ్రీ





**అక్షర రేఖ గోదావరిఖని /పెద్దపల్లి, సెప్టెంబర్ 9(జిల్లా ప్రతినిధి నాగండ్ల రవి కుమార్):** స్వచ్ఛ సర్వేక్షణ్ 2025లో రామగుండం నగరం ఉత్తమ ర్యాంకు సాధించేందుకు మున్సిపల్ సిబ్బంది కృషి చేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) మరియు కమిషనర్ (ఎఫ్ ఏ సి ) జె. అరుణశ్రీ అన్నారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మంగళవారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో స్వచ్ఛ సర్వేక్షణ్ 2025పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ "స్వచ్ఛ సర్వేక్షణ్ 2025లో మెరుగైన ర్యాంకు సాధించేందుకు అవసరమైన ఎఫ్.ఎస్.టి.పీ., డి.ఆర్.సి.సి., కంపోస్ట్ యార్డ్, డంపింగ్ యార్డ్, ఓడీఎఫ్ ౦౦ ధృవీకరణతో పాటు యంత్రాలు, మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయి. తడి చెత్త, పొడి చెత్తను ఇంటి వద్దనే వేరు వేరు సేకరించి రీసైక్లింగ్ ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేస్తే ఎక్కువ మార్కులు సాధించే అవకాశం ఉంది. సిబ్బంది దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి" అని సూచించారు. అలాగే, స్వచ్ఛ సర్వేక్షణ్ 2025లో మొత్తం 12,500 మార్కులు ఉన్నందున గరిష్ట మార్కులు సాధించేందుకు ప్రతి అంశంపై అవగాహన పెంపొందించుకొని సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానాలు విధించాలని కూడా సూచించారు. ఎకో వారియర్స్ కన్సల్టెన్సీ ప్రతినిధులు శివకృష్ణ, కరుణాకర్, మహేంద్ర పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా మార్గదర్శకాలను వివరించి, మెరుగైన ర్యాంకు సాధించేందుకు అనుసరించాల్సిన మార్గాలను సిబ్బందికి తెలియజేశారు. ఈ వర్క్‌షాప్‌లో నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి, మెప్మా టీఎంసీ రజనీతో పాటు వార్డు అధికారులు, సి ఓ లు, సానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు, ఆర్పీ లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాకవి కాళోజీ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా



**అక్షర రేఖ గోదావరిఖని /పెద్దపల్లి, సెప్టెంబర్ 9(జిల్లా ప్రతినిధి నాగండ్ల రవి కుమార్):** ప్రజాకవి కాళోజీ నారాయణరావు 111వ జయంతి (తెలంగాణ తెలుగు భాష దినోత్సవం) సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ అంబర్ కిషోర్ ఝా కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ తెలంగాణ యాసలో సామాజిక రచనలు చేసి ప్రజలను చైతన్యపరిచి, సామాజిక మేల్కొలుపుకు కృషి చేసిన గొప్ప ప్రజాకవి కాళోజీ. ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం పద్మవిభూషణ్ బిరుదుతో గౌరవించింది. కాళోజీ గారి జీవితం అందరికీ స్ఫూర్తిదాయకం. ఆయన సాహిత్యం ఉద్యమ సాధనలో ఉత్తేజాన్ని నింపింది. అన్నివేళలా ఆయన ఆదర్శం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఇంచార్జ్ ఏసీపీ శ్రీనివాస్, ఏవో శ్రీనివాస్, ఆర్ఐలు దామోదర్, శ్రీనివాస్, మల్లేశం, వివిధ వింగ్స్ ఇన్‌స్పెక్టర్లు, సీపీఓ సూపరింటెండెంట్లు, సిబ్బంది, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొని కాళోజీకి నివాళులు అర్పించారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రగతి పై సమావేశం.




**అక్షర రేఖ న్యూస్, సెప్టెంబర్ 09, సిద్దిపేట ప్రతినిధి.** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రగతిపై మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీ గరీమా అగ్రవాల్ ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు,హౌసింగ్ డిఇలు,ఏఈ లతో జూమ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమమైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు ప్రాధాన్యతనిస్తూ ఇండ్ల నిర్మాణం నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా ప్రత్యేకంగా పర్యవేక్షించాలని అన్నారు. హౌసింగ్ ఏఈ లు డిఇ లు ప్రతిరోజు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ లబ్ధిదారులకు ఇసుక సరఫరా, నిర్మాణ సామాగ్రి లభ్యత తదితర ఎలాంటి సమస్య వచ్చిన వెంటనే అధికారులకు తెలియజేసి సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు.

## ఉత్తమ ట్రైనీ ఆఫీసర్‌గా బొమ్మక సత్యానంద్

కార్మికశాఖ మంత్రి వివేక్ చేతులమీదుగా ప్రశంసా పత్రం




**అక్షర రేఖ గోదావరిఖని /పెద్దపల్లి, సెప్టెంబర్ 9(జిల్లా ప్రతినిధి నాగండ్ల రవి కుమార్):** ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శ్రీరాంపూర్ ఐటీఐ కాలేజీలో అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న, గోదావరిఖని నివాసి బొమ్మక సత్యానంద్‌కు రాష్ట్ర కార్మికశాఖ మంత్రి శ్రీ వివేక్ చేతుల మీదుగా ఉత్తమ ట్రైనింగ్ ఆఫీసర్ అవార్డు లభించింది. ఈ సందర్భంగా ఆయనకు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. బొమ్మక సత్యానంద్ సత్కారాన్ని తోటి ట్రైనింగ్ ఆఫీసర్లు, కళాశాల సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రటరీ మరియు డైరెక్టర్ శ్రీ దాన కిషోర్, కళాశాల ప్రిన్సిపల్ సుజాతతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో మంగళవారం ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.



**అక్షర రేఖ సెప్టెంబర్ 09, 2025-నిర్మల్:-** కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ హాజరై కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సాధారణ ప్రజల హృదయాలకు హత్తుకునేలా, తెలంగాణ యాసలో కవితలు రాసి ప్రజలను చైతన్యపరిచిన మహనీయుడు కాళోజీ అని కొనియాడారు. ఆయన కృషికి గుర్తింపుగా ప్రభుత్వం పద్మ విభూషణ్ అవార్డు అందజేసిందని గుర్తుచేశారు. కాళోజీ పుట్టినరోజుని తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకోవడం గర్వకారణమని పేర్కొన్నారు. ప్రభుత్వం మహనీయుల జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించడం ద్వారా భావితరాలకు వారి గొప్పతనం చేరువవుతుందని అదనపు కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు నరసింహారెడ్డి, రమణ, శ్రీకాంత్ రెడ్డి, మోహన్ సింగ్, ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సేవా పక్షం ( సేవా పక్కవదా ) కార్యశాల...

**మెదక్ జిల్లా ప్రతినిధి వెంకటేష్, సెప్టెంబర్ 09(అక్షర రేఖా న్యూస్):** మెదక్ బిజెపి పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ గారి అధ్యక్షతన సేవా పక్షం మెదక్ జిల్లా కార్యశాల నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మెదక్ పార్లమెంట్ కో కన్వీనర్ శ్రీనివాస్ గారు ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ సెప్టెంబర్ 17న దేశ ప్రధాని గౌరవ శ్రీ నరేంద్ర మోడీ గారు పుట్టినరోజు సందర్భంగా సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు చేయవలసిన కార్యక్రమాలు రక్తదాన శిబిరం - జిల్లా అన్ని మండలాలు, మున్సిపాలిటీలలో నిర్వహించాలి. ఒక్కో రక్తదాన శిబిరంలో కనీసం 75 యూనిట్లు తగ్గకుండా నిర్వహించాలి. ఆత్మనిర్భర భారత్, వికసిత్ భారత్ అంశాలపై, మహిళా మోర్చా ఆధ్వర్యంలో అసెంబ్లీలో స్థాయిలో చిత్రలేఖనం నిర్వహించాలి. స్వచ్ఛభారత్: శక్తికేంద్రం, మండల కేంద్రంలో ముఖ్యమైన స్థానాలో నిర్వహించాలి. స్వచ్ఛభారత్ చేయడానికి ముందు పరిసరాల ఫోటో, స్వచ్ఛభారత్ నిర్వహించిన తర్వాత పరిసరాల ఫోటో, చిన్న వీడియోలు తీయాలి. ఈ కార్యక్రమానికి స్థానిక సెలబ్రెటీలను ఆహ్వానించాలి. నమో మారథాన్, యువమోర్చా ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో 2-3 కి.మీ నిర్వహించాలి. యువత, విద్యార్థులను భాగస్వామ్యం చేయాలి. (1) ప్రవాస్-బూతొయిలో మొక్కలు నాటడం, దీనదయాళ్ జీకి నివాళులు అర్పించడం, ప్రసంగం. (2) జిల్లా స్థాయిలో మేధావులతో సమావేశం (3) డాక్యుమెంటరీ ప్రదర్శన, (4) ఖాదీ స్టాల్ దివ్యాంగులకు సన్మానం, దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ- ఎంపీ, ఎమ్మెల్యేల నియోజకవర్గాలలో నిర్వహించాలి. విశిష్ట (పద్మశ్రీ, పద్మభూషన్, పద్మ విభూషన్, అర్జున అవార్డ్ పొందిన) వ్యక్తులకు సన్మానం -హైదరాబాద్ మహాత్మా గాంధీజీకి నివాళులు - లాల్బహదూర్ శాస్త్రీ కార్యక్రమాలన్నీ చేయాలని జిల్లా నాయకులకు మండల నాయకులకు వివరించడం జరిగింది.. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు . శ్రీనివాస్ సంఘసాని సురేష్ ఈర్ల రంజిత్ రెడ్డి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు జిల్లా ఉపాధ్యక్షుడు బుచ్చేష్ యాదవ్ రాజేందర్ శంకర్ గౌడ్



జనగాం ప్రబారి నందా రెడ్డి మాజీ ప్రధాన కార్యదర్శులు %మీాచీ% రెడ్డి విజయ్ కుమార్ సుధాకర్ రెడ్డి జిల్లా కార్యదర్శి కల్కి నాగరాజు అశోక్ సాదుల బాదే బాలరాజు అసెంబ్లీ కన్వీనర్ మధుసూదన్ జిల్లా యువ మోర్చా అధ్యక్షులు సతీష్ జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి కవితా రెడ్డి ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు గుండం శంకర్ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఏసీ రెడ్డి జిల్లా నాయకులు లోకేష్ ఆకుల ప్రభాకర్ శ్రీనివాస్ గౌడ్ మండల అధ్యక్షులు మండల ప్రధాన కార్యదర్శులు మండల సేవా పక్వాడ్ కన్వీనర్లు కో కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ కరస్పాండెంట్ అవార్డు అందుకున్న అబ్బు కేశవరెడ్డి

అభినందనలు తెలిపిన లయన్స్ క్లబ్ సభ్యులు



**అక్షర రేఖ గోదావరిఖని /పెద్దపల్లి, సెప్టెంబర్ 9(జిల్లా ప్రతినిధి నాగండ్ల రవి కుమార్):** ప్రగతి విద్యాసంస్థల కరస్పాండెంట్, లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటర్ కార్యదర్శి అబ్బు కేశవరెడ్డి గారు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ కరస్పాండెంట్ అవార్డు అందుకున్నారు. జిల్లా కలెక్టర్ శ్రీమతి కోయ హర్ష, డీఈవో మాధవి స్వయంగా ఈ అవార్డును అబ్బు కేశవరెడ్డికి అందజేశారు. విద్యారంగ అభివృద్ధి, విద్యార్థుల సమగ్ర వికాసం కోసం ఆయన చేసిన కృషి విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా అబ్బు కేశవరెడ్డి మాట్లాడుతూ "ఈ అవార్డు నాకు మాత్రమే కాకుండా ప్రగతి విద్యాసంస్థల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులందరికీ దక్కిన గౌరవం. విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో మరింత కృషి చేస్తాను" అని అన్నారు. అవార్డు లభించిన సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీకాలనీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అబ్బు కేశవరెడ్డిని ఘనంగా అభినందించారు.

## సింగరేణి యువ బలగం ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల పంపిణీ

ఆకలి తీర్చిన చేయి ఎప్పటికీ ఖాళీ కావదు

యువ బలగం ప్రతినిధులు



**అక్షర రేఖ మంథని/పెద్దపల్లి, సెప్టెంబర్ 9(జిల్లా ప్రతినిధి నాగండ్ల రవి కుమార్):** ఆర్జీ3 పరిధిలోని ఓసిపి 1లో ఫిట్టర్గా పనిచేస్తున్న కే.ఎల్.ఎన్.వి. ప్రసాద్ గారి మనుమడు చిరంజీవి అద్విత్ జన్మదినాన్ని పురస్కరించుకొని, నిరుపేదలకు సహాయం చేయాలన్న సదుద్దేశంతో సింగరేణి యువ బలగం ఆధ్వర్యంలో లద్నాపూర్లోని ఒక నిరుపేద కుటుంబానికి నెలకు సరిపడ నిత్యావసర సరుకులను సోమవారం సాయంత్రం అందజేశారు. ఈ సందర్భంగా యువ బలగం ప్రతినిధులు మాట్లాడుతూ "ఇలాంటి కార్యక్రమాలు కష్టకాలంలో ఉన్నవారికి ఆర్థిక భారం తగ్గిస్తాయి. సామాజిక బాధ్యతను గుర్తుచేస్తూ సమాజంలో సహకార భావన పెంపొందిస్తాయి" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సింగరేణి యువ బలగం సభ్యులు పాశం శ్రీనివాస్ రెడ్డి, వేరగోని సంతోష్, రాజశేఖర్ రెడ్డి, గంది శ్రీను, మండ సురేష్, శ్రీకాంత్ రావు, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## కాలోజి సేవలు చిరస్మరణీయం

:డిఆర్ఓ భుజంగరావు



**మెదక్ జిల్లా ప్రతినిధి వెంకటేష్, సెప్టెంబర్ 09(అక్షర రేఖా న్యూస్):** స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రజాకవి కాలోజి నారాయణరావు సేవలు చిరస్మరణీయమని డి ఆర్ ఓ భుజంగరావు అన్నారు. కాలోజి జయంతిని పురస్కరించుకొని జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన కార్యక్రమంలో కాళోజి నారాయణరావు చిత్రపటానికి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాలోజి వ్యక్తిత్వం, రచనలు ప్రజాస్వామ్య, నైతిక విలువలకు ప్రతిరూపమని పేర్కొన్న యువత ఆయన ఆలోచనలనుంచి ప్రేరణ పొందాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏవో యూనస్ సంబంధిత అధికారులు పాల్గొని నివాళులు అర్పించారు.

## ఈనెల 13న జరగబోయే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని

:మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు,



**మెదక్ జిల్లా ప్రతినిధి వెంకటేష్, సెప్టెంబర్ 09(అక్షర రేఖా న్యూస్)బీ** ఎస్పీ గారు ఒక ప్రకటనలో మాట్లాడుతూ, "రాజీ మార్గమే రాజమార్గం. కక్షలతో ఎటువంటి లాభం లేదు. కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృథా చేసుకోవద్దు. రాజీ పడితే ఇరువురూ గెలుస్తారు, కొట్టుకుంటే ఒకరే గెలుస్తారు" అని పేర్కొన్నారు. జాతీయ మెగా లోక్ అదాలత్ (తేదీ: 13-09-2025) సందర్భంగా రాజీ పడదగిన కేసులు వేగంగా పరిష్కారం కానున్నాయని ఆయన తెలిపారు. వీటిలో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన, కుటుంబ పరమైన వివాదాలు, రోడ్డు ప్రమాదాలు, చిన్నచిన్న దొంగతనాలు, వైవాహిక సమస్యలు, డ్రంక్ అండ్ డ్రైవ్, టౌన్ న్యూసెన్స్, బ్యాంకు రికవరీ, టెలిఫోన్ రికవరీ కేసులు, చెక్ బౌన్స్ తదితర కేసులు ఉన్నాయి. అలాగే, లు, కోర్ట్ కానిస్టేబుళ్లు మరియు సంబంధిత సిబ్బంది ఈ కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించాలని, రాజీ పడేలా అవగాహన కల్పించాలని ఎస్పీ గారు ఆదేశించారు. దీనివల్ల ఇరువర్గాలకూ తక్కువ సమయంలో న్యాయం లభించి, పరస్పర సహకారంతో సమస్యలు శాంతియుతంగా పరిష్కారం అవుతాయని ఆయన వివరించారు. ఎస్పీ గారు ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, న్యాయశాఖ అందిస్తున్న ఈ ప్రత్యేక అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని కోరారు. లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందని, చిన్నచిన్న కేసుల కోసం కోర్టు చుట్టూ తిరగకుండా ఈ లోక్ అదాలత్ ఉపయోగించుకోవడం సమాజానికి మేలని ఆయన స్పష్టం చేశారు.

## కాళోజీ గారు తెలంగాణకు కవిత్వం ద్వారా ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చిన మహానుభావులు

:జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు



**మెదక్ జిల్లా ప్రతినిధి వెంకటేష్, సెప్టెంబర్ 09 (అక్షర రేఖా న్యూస్):** జాతీయ కవి, ప్రజాకవి కాళోజీ నారాయణరావు గారి జయంతి సందర్భంగా ఈ రోజు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, ఐపీఎస్ గారు ఈ కార్యక్రమంలో పాల్గొని, కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ కాళోజీ గారు తెలంగాణకు కవిత్వం ద్వారా ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చిన మహానుభావులు అని పేర్కొన్నారు. ఆయన రచనలు సామాజిక చైతన్యాన్ని పెంపోందిచేలా, ప్రజా హక్కుల కోసం నడిపించేలా ఉంటాయని గుర్తుచేశారు. ఉద్యమకారుడిగా, కవిగా ఆయన సమాజానికి చేసిన సేవలు మరువలేనివని అన్నారు. జిల్లా పోలీసులు తమ విధుల్లో ప్రజాసేవను ప్రధాన ధ్యేయంగా తీసుకుని, కాళోజీ గారి ఆలోచనలను స్పూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని ఎస్పీ గారు సూచించారు. ఈ కార్యక్రమంలో మెదక్ అదనపు ఎస్పీ శ్రీ. ఎస్ మహేందర్ గారు మరియు సైబర్ క్రైమ్ డియస్పి శ్రీ. సుభాష్ చంద్ర బోస్ గారు మరియు ఏఆర్ డియస్పి రంగా నాయక్ గారు మరియు ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీ. ఎస్ సందీప్ రెడ్డి గారు మరియు ఇన్స్పెక్టర్ శ్రీ. మధు సుధన్ గౌడ్ గారు మరియు ఆర్ఐ లు శ్రీ. రామకృష్ణ గారు, శ్రీ. శైలందర్ గారు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## నాణ్యమైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం



జిల్లా కలెక్టర్ బి.ఎం.సంతోష్

**అలంపూర్, సెప్టెంబర్ 09(అక్షర రేఖ) :** ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఇళ్లు నిర్మించగలిగేలా సలహాలు ఇచ్చి,పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం అయిజ మున్సిపల్ పరిధిలోని వార్డ్ నం.6 లో ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద మంజూరైన లబ్ధిదారులు చేపట్టిన ఇండ్ల నిర్మాణాలను తనిఖీ చేశారు.ఇంటి నిర్మాణం, పనులలో నాణ్యతను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్లలో మొత్తం 12 ఇళ్లకు మంజూరు అయినట్లు అందులో 5 రూఫ్ లెవెల్, 7 బేస్మెంట్ లెవెల్ ఉన్నట్లు అధికారులు కలెక్టర్ కు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసేలా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. హౌసింగ్ ఇంజినీర్లు, నిర్మించడానికి అవసరమైన సలహాలు ఇవ్వాలన్నారు. లబ్ధిదారులు త్వరితగతిన ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవడానికి ప్రభుత్వ నిధులను ఎప్పటికప్పుడు డబ్బులు వారి ఖాతాకు జమ చేయాలని కలెక్టర్ తెలిపారు.ప్రభుత్వం ఇసుకను ఉచితంగా అందిస్తుందని, లబ్ధిదారులు కేవలం కూలీ, రవాణా చార్జీలను మాత్రమే చెల్లించవలసి ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు.ఇసుక,మట్టి కొరత లేకుండా అందుబాటులో ఉండేలా అధికారులను చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ లబ్ధిదారుల నుండి ఇళ్ల నిర్మాణానికి ఏమైనా సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకొని, పనులను వేగంగా పూర్తి చేయాలని,దశలవారీగా డబ్బులు ఖాతాలో వెంటనే జమ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సైదులు,మున్సిపల్ మేనేజర్ అశోక్ రెడ్డి, హౌసింగ్ ఎ.ఈ వంశీ,వార్డ్ ఆఫీసర్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఒక గుణపాఠం



**జగిత్యాల,సెప్టెంబర్ 09, అక్షర రేఖ న్యూస్** టీఎస్పీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల కేసులో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఒక గుణపాఠమని జగిత్యాల జిల్లా తొలి జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ అన్నారు.గ్రూప్ వన్ ఎగ్జామ్ రద్దు చేయడం ఆహ్వానించ దగ్గ పరిణామామని,ఎగ్జామ్ రద్దు చేసి రీ ఎగ్జామ్ నిర్వహించాలని గతంలోనే బిఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేశారని ఈ సందర్భంగా అన్నారు. హైకోర్టు తీర్పుతో నిరుద్యోగులకు న్యాయం జరిగిందని ఇది ముమ్మాటికి గ్రూప్ ఫన్ బాధితుల అలుపెరుగని పోరాటానికి దక్కిన గెలుపు అని అన్నారు. ఎన్నికల సమయంలో ఢిల్లీ నుంచి వచ్చిన రాహుల్ గాంధీ రాజ్యాంగన్నీ చేతిలో పట్టుకొని అశోక్ నగర్ లో నిరుద్యోగులకు హామీ ఇచ్చారు కానీ రెండేళ్లలో ఒక కొత్త ఉద్యోగం కూడా ఇవ్వకుండా నిరుద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని అన్నారు. ఇకనైనా పారదర్శకంగా ఎగ్జామ్స్ నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు.

## కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు



**తరిగోప్పుల (అక్షర రేఖ) సెప్టెంబర్:09** మండల కేంద్రంలోని అబ్దుల్ నాగరం గ్రామ పంచాయితీ కార్యాలయంలో కార్యదర్శి కంకటి రవీందర్ ఆధ్వర్యంలో కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ కాళోజీ నారాయణరావు తెలంగాణ ప్రాంతానికి చెందిన ఒక ప్రసిద్ధ ప్రజాకవి మాత్రమే కాకుండా స్వాతంత్ర్య సమరయోధుడని అన్నారు. ఉద్యమకారుడిగా, రాజకీయ కార్యకర్తగా, గొప్ప కవిగా కాళన్నగా పేరు గడించారని కొని యాడారు. తెలంగాణ తొలి దశ ఉద్యమాలకు ప్రతిధ్వనిగా నిలిచిన మహనీయుడు కాళోజీ నారాయణరావు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ మంజుల, పర్శరాములు, గ్రామ శాఖ సిబ్బందులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గోన్నారు.

## (వానరుల సేవలు ఆధ్యాత్మిక కుటుంబం) ఆధ్యాత్మిక.




**జగిత్యాల జిల్లా సెప్టెంబర్. 9 అక్షర రేఖ** న్యూస్కుటుంబం ప్రతి మంగళవారం కొండగట్టు వానరులకు ఆహారం పంపిణీ ఈరోజు వుటూరి నవీన్ (జగిత్యాల పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు) వారి సౌజన్యంతో ఈరోజు వానరులకు ఆహారం పంపిణీ జరిగిన ది ఈ కార్యక్రమంలో సూర శ్రీనివాస్, బాశెట్టి ప్రభాకర్, యాంసాని శ్రీనివాస్, యాంసాని సంతోష్,జిల్లా ప్రకాష్,బొడ్ల లక్ష్మణ్, నాగమల్ల శ్రీనివాస్ (మెడికల్) ,పల్లెర్ల లవకుమార్ ,యాంసాని మహేందర్ ఈరోజు సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు వారికి వారి కుటుంబానికి కొండగట్టు ఆంజనేయ స్వామి ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నాను??

## మంత్రి జూపల్లి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**అక్షర రేఖ సెప్టెంబర్ 09, 2025 నిర్మల్:-** జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం నిర్మల్ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా నిర్మల్ గ్రామీణ మండలం కొండాపూర్ సమీపంలోని చంద్రశేఖర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మంగళవారం పరిశీలించారు. ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసే స్టాళ్లు, నూతన రేషన్ కార్డుల పంపిణీ, పలు పథకాల కింద ధ్రువీకరణ పత్రాల పంపిణీకి సంబంధించి, ఏర్పాట్లను ఆమె సమీక్షించారు. అదేవిధంగా స్టాల్స్, సీటింగ్, స్టేజ్, పార్కింగ్ వంటి అంశాలను పరిశీలించి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమం విజయవంతంగా సాగేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, నిర్దేశిత సమయానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, జెడ్పీ సీఈవో గోవింద్, డిఆర్డిఓ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, తహసీల్దార్లు రాజు, సంతోష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఘనముగా ప్రజా కవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి.



**అక్షర రేఖ న్యూస్, సెప్టెంబర్ 09, సిద్దిపేట ప్రతినిధి.** ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో అధికారికంగా నిర్వహించిన జయంతి ఉత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ కె హైమావతి హాజరై, జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ తో కలిసి కాలోజి నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... తెలంగాణ మాండలికంలో సామాజిక రచనలు చేస్తూ తెలంగాణ ప్రజలను సామాజికంగా మేల్కొల్పిన గొప్ప ప్రజాకవి కాళోజి నారాయణరావు అని ఆయన సేవలను గుర్తించి ప్రభుత్వం పద్మవిభూషణ్ బిరుదుతో గౌరవించిందని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆయన పుట్టిన రోజును తెలంగాణ భాషా దినోత్సవంగా ప్రకటించి అధికారికంగా ఆయన జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తూ భావితరాలకు ఆయన స్ఫూర్తిని అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ నాగరాజమ్మ, డి ఆర్ డి ఓ జయదేవ్ ఆర్య తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ దిద్దాల్సిందే!

-మొదటిపేజీ తరువాయి

ఆధారంగా 563 పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని సూచించింది. ఇది సాధ్యంకాని పక్షంలో గ్రూప్%-%1 మెయిన్స్ పరీక్ష రద్దు చేసి ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణత సాధించిన అందరికీ తిరిగి మెయిన్స్ పరీక్ష నిర్వహించాలని స్పష్టం చేసింది. ఈ ప్రక్రియంతా మంగళవారం నాటి ఉత్తర్వుల కాపీ అందిన రోజు నుంచి 8 నెలల్లో పూర్తి చేయాలంటూ కీలక తీర్పు వెలువరించింది. 2024 అక్టోబర్ 21 నుంచి 27 వరకు నిర్వహించిన గ్రూప్%-%1 మెయిన్స్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనంలో అవకతవకలు, అసమానతలు చోటుచేసుకున్నాయని, దీనిపై న్యాయ విచారణ జరిపించాలని కోరుతూ సిద్దిపేట శివనగర్‌కు చెందిన కె.పర్శరాములుతో పాటు మరికొందరు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిని విచారించిన జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు సుదీర్ఘ వాదనల అనంతరం.. జూలై 7న తుది తీర్పు రిజర్వు చేశారు. తాజాగా మంగళవారం తీర్పు వెలువరించారు. ఈ కేసుకు సంబంధించిన మొత్తం సమస్యను విధానపరమైన, మూల్యాంకన విధానం అనే రెండు కేటగిరీలుగా విభజించవచ్చునని న్యాయమూర్తి తెలిపారు. ఒక్కో కేటగిరీలోని అంశాల వారీగా తీర్పు ఇచ్చారు.

**1) విధానపరమైన అంశాలు..**

రెండు హాల్ టికెట్ల జారీ: 2024 ఫిబ్రవరి 19న టీజీపీఎస్సీ ఇచ్చిన నోటిఫికేషన్‌లో రెండు హాల్‌టికెట్ల ప్రస్తావన ఎక్కడా లేదు. కానీ వేర్వేరు హాల్ టికెట్లు జారీ చేయడం అనుమానాలకు తావిస్తోంది. కమిషన్ వివరణ కూడా అస్పష్టంగా ఉంది. యూపీఎస్సీనే ఒక హాల్‌టికెట్ ఇస్తున్నప్పుడు.. ఇక్కడ రెండు ఎందుకనే దానిపై వివరణ నమ్మశక్యంగా లేదు. 2011లో ఇదే విధానం అనుసరించినట్లు కమిషన్ పేర్కొన్నా.. ఆ డాక్యుమెంట్లను సమర్పించలేదు. నోటిఫికేషన్ లేదా నిబంధనల మేరకు పరీక్ష జరగలేదని ఈ కోర్టు అభిప్రాయపడుతోంది.

కేంద్రాల కేటాయింపు: 18, 19 పరీక్షా కేంద్రాల్లో మహిళా అభ్యర్థులకే ప్రాధాన్యత ఎలా ఇచ్చారు. రాండమైజేషన్ విధానమే అయితే ఎక్కువ మంది మహిళా అభ్యర్థులను రెండు కేంద్రాలకే ఎలా కేటాయించారు? మహిళా అభ్యర్థులనే కేటాయించాలని కళాశాల అధికారులు చెప్పినట్లు కమిషన్ పేర్కొన్నా ఆధారాలను సమర్పించలేదు. అసలు అలా కేటాయింపులో ప్రాధాన్యత ఎందుకో కమిషన్ చెప్పలేదు. నోటిఫికేషన్‌లో పేర్కొనలేదు. మరోవైపు శారీరకంగా వికలాంగులైన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వలేదు. నగరానికి దూరంగా 2వ, 3వ అంతస్తుల భవనాలను కేటాయించింది. ఇది కేంద్రాలను కేటాయించడంలో వివక్షను ప్రతిబింబిస్తోంది.

**హాజరులో అసమానత:**

మెయిన్స్‌కు హాజరైన అభ్యర్థుల సంఖ్యను.. 21,093, 21,085, 21,110, 20,161గా ఇలా ఒక్కోసారి ఒక్కోలా పేర్కొంది. అభ్యర్థుల హాజరు నమోదులో కమిషన్ నిర్లక్ష్యంగా వ్యవహరించింది. రాజ్యాంగ సంస్థ ఇలా చేయడం ప్రశంసించలేం. తుది మార్కుల జాబితా విడుదల సమయంలో 21,085 మందిగా పేర్కొంది. సంఖ్యలో మార్పునకు ఎటువంటి వివరణ లేదు.

**బహుళ మూల్యాంకనం:**

జవాబు పత్రాల తొలి రెండు మూల్యాంకనాల్లో మార్చి 13 నాటి వెబ్ నోట్ ప్రకారం బార్‌కోడ్, బబ్లింగ్‌లున్నాయి. మూడో మూల్యాంకనంలో ఇవి లేవు. ఏపీలో నిర్వహించినట్లు ఇక్కడా చేశామని కమిషన్ చెప్పినా మూడో మూల్యాంకనం భిన్నంగా ఉండటంతో మార్కులను మార్చే అవకాశం ఉంది. నోటిఫికేషన్‌లో మూడో మూల్యాంకనంపై వివరాలు లేవు. కమిషన్ చర్యలు గ్రూప్%-%1 మెయిన్స్ పరీక్ష పవిత్రతను దెబ్బతీశాయి. మూల్యాంకన ప్రక్రియ పిటిషనర్ల వాదనలకు బలాన్ని చేకూర్చింది. వారి వాదన తోసిపుచ్చలేం.

**మార్కుల జాబితా ప్రచురణ:**

నిబంధనల ప్రకారం అభ్యర్థుల మార్కులను సబ్జెక్టుల వారీగా ప్రచురించాలి. అలా చేయకుండా కమిషన్ వ్యక్తిగత లాగిన్‌లకు సబ్జెక్టుల వారీగా పంపింది. అంటే ఎవరి మార్కులు వారికే కనిపిస్తాయి తప్ప.. ఇతరుల మార్కులు తెలియవు. ఇది సరికాదు. అందరి అభ్యర్థుల మార్కులతో జాబితాను ప్రచురించకపోవడం పారదర్శకతను దెబ్బతీస్తోంది. దీనిపై కమిషన్‌ను ప్రశ్నించే హక్కు అభ్యర్థులకు ఉంది.

**అర్హత సాధించని అభ్యర్థుల పేపర్ల మూల్యాంకనం:**

ఇంగ్లిష్ పరీక్షలో అర్హత సాధించిన తర్వాతే ఇతర పేపర్లు మూల్యాంకనం చేశామని కమిషన్ చెప్పింది. అయితే జనరల్ ఇంగ్లిష్‌లో అర్హత సాధించని వారి పేపర్లూ మూల్యాంకనం చేసినట్లు 12 మంది పేర్లు పరిశీలిస్తే తెలుస్తోంది. పరీక్ష నిర్వహణలో అసమగ్రతను ఇది స్పష్టం చేస్తోంది. దశాబ్దంగా ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు ఇది అశనిపాతం లాంటిది.

**ఖాళీలు పెంచడం:**

రెండో నోటిఫికేషన్ ద్వారా ఖాళీల సంఖ్య పెంచారు. మళ్లీ దరఖాస్తులు తీసుకున్నారు. అంతకుముందు దరఖాస్తు చేసుకోని వాళ్లు కూడా కొత్తగా రావడంతో అభ్యర్థుల సంఖ్య పెరిగింది. అయితే దీనిపై ఇప్పటికే ఇదే హైకోర్టు తీర్పునిచ్చింది. అందుకే ఈ అంశంపై విచారణకు నిరాకరించాం.

**2) మూల్యాంకన విధానం..**

మూల్యాంకనదారుల ఎంపిక:

రెగ్యులర్ అధ్యాపకులు, ఇద్దరు రిటైర్డ్ అధ్యాపక సభ్యులను మెయిన్స్ మూల్యాంకనానికి నియమించినట్లు కమిషన్ పేర్కొంది. వీరి పేర్లను రహస్యంగా ఉంచామని, పిటిషనర్లు బహిర్గతం చేసినందుకు చట్టప్రకారం చర్యలు తీసుకునే హక్కు ఉందని వాదించింది. అలాంటప్పుడు ఆ వివరాలిచ్చిన కమిషన్ ఉద్యోగులపై కూడా చర్యలు తీసుకోవాలి. నోటిఫికేషన్ ప్రకారం రెగ్యులర్ ఉద్యోగులను మాత్రమే తీసుకోవాలన్నది పిటిషర్ల వాదన.

ప్రైవేట్ ట్యూటర్‌గా పనిచేసిన డాక్టర్ ఎం.ఎ.మాలిక్‌ను కూడా తీసుకున్నారని వారు తెలిపారు. ఇతను 22 ఏళ్లుగా ఆంధ్రజ్యోతి సహా ఇతర పత్రికలకు పోటీ పరీక్షల కథనాలను అందిస్తున్నానని పేర్కొన్నారు. దీనిని అంగీకరించని కమిషన్ పిటిషనర్లపై కేసులు నమోదు చేస్తామని బెదిరించింది. అలాగే కమిషన్ రెగ్యులర్ ఫ్యాకల్టీ అనే దానికి అర్థాన్ని మార్చింది.

**పత్రాలు దిద్దిన విధానం:**

సమాధాన పత్రాల మూల్యాంకనానికి ఏదైనా విధానం ఉందా? కీ ఉందా? అని కమిషన్‌ను ప్రశ్నించాం. ఎటువంటి కీ లేదని, మూల్యాంకనదారులు సబ్జెక్ట్ నిపుణులని పేర్కొంది. తర్వాత కీ ఉందని సీల్డ్ కవర్‌లో సమర్పించింది. కీ విషయంలో కమిషన్ తన వాదనను ఎప్పటికప్పుడు మార్చింది. పరీక్షల నిర్వహణ, మూల్యాంకనాలపై ఏదైనా కొత్త వ్యవస్థను ప్రవేశపెట్టాలనుకుంటే సర్కార్‌ను సంప్రదించాలి. కానీ అలా జరగలేదని తెలుస్తోంది. కోర్టుకు సమర్పించిన కీలోనూ లోపాలున్నాయి.

# కొత్త ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్

-మొదటిపేజీ తరువాయి

చేపట్టనున్నారు. తమిళనాడు నుంచి ఈ పదవిని అధిష్టించిన సర్వేపల్లి రాధాకృష్ణన్, ఆర్.వెంకట్రామన్‌ల తర్వాత మూడో నాయకుడిగా సీపీ రాధాకృష్ణన్ చరిత్రకెక్కారు.

**ఘన విజయం...**

ఉపరాష్ట్రపతి ఎన్నికల పోలింగ్ నూతన పార్లమెంట్ భవనంలోని 'వసుధ ఎఫ్%-%101'లో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగింది. ఈ పోలింగ్‌లో మొత్తంగా 767 మంది ఎంపీలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రస్తుతం రాజ్యసభలో 6, లోక్‌సభలో ఒక ఖాళీ స్థానాన్ని పక్కనబెడితే లోక్‌సభలో 542 మంది, రాజ్యసభలో 239 మంది కలిపి 781 మంది ఎంపీలు ఓటింగ్‌లో పాల్గొనాల్సి ఉంది. అయితే ముందే ప్రకటించినట్లుగా బీఆర్ఎస్‌కు చెందిన నలుగురు ఎంపీలు, ఏడుగురు బీజేడీ ఎంపీలతోపాటు శిరోమణి అకాలీదళ్ ఎంపీ ఒకరు, స్వతంత్ర ఎంపీ సరబ్‌జీత్‌సింగ్ ఖల్సా ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. దీంతో మొత్తంగా 767 (98.2 శాతం) ఓట్లు పోలయ్యాయి. విజయానికి అవసరమైన ఓట్లను 377గా నిర్ణయించారు. సాయంత్రం 6 గంటల నుంచి ఓట్లను లెక్కించి రాత్రి 7:30 గంటలకు ఫలితాన్ని ప్రకటించారు. మొత్తం పోలైన 767 ఓట్లలో చెల్లని ఓట్లు 15 ఉండగా మిగిలిన 752 ఓట్లలో రాధాకృష్ణన్‌కు 452 మొదటి ప్రాధాన్యతా ఓట్లు లభించాయని.. జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డికి 300 మొదటి ప్రాధాన్యత ఓట్లు వచ్చాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారి పీసీ మోదీ ప్రకటించారు.

**అనుకున్నట్లే క్రాస్ ఓటింగ్**

ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో అందరూ ఊహించినట్లే క్రాస్ ఓటింగ్ జరిగినట్లు తెలిసింది. ఇండియా కూటమిలోని పక్షాలు, తమకు మద్దతుగా వచ్చిన ఆప్ సహా ఇతర చిన్నాచితక పార్టీలతో కలిసి కాంగ్రెస్ కనీసం 324 ఓట్లు వస్తాయని అంచనా వేసింది. పోలింగ్ జరుగుతున్న సమయంలోనే ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ 'ప్రతిపక్షాలు ఐక్యంగా నిలబడ్డాయి. కూటమికి చెందిన 315 మంది ఎంపీల్లో అందరూ ఓటింగ్ కోసం హాజరయ్యారు'అని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. అయితే కాంగ్రెస్ పేర్కొన్నట్లుగానే 15 ఓట్లు క్రాస్ ఓటింగ్ అయ్యాయి. దీంతోపాటు చెల్లని ఓట్లు సైతం ఇండియా కూటమి పక్షాలవేనని ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే 20%-%25 ఓట్లు ఎన్డీఏ అభ్యర్థికి క్రాస్ ఓటింగ్ జరిగి ఉండొచ్చని భావిస్తున్నారు. మరోవైపు రాధాకృష్ణన్‌కు ఎన్డీయే కూటమిలోని 427 మంది ఎంపీల మద్దతు ఉందని బీజేపీ కాగితంపై లెక్కలేసుకోగా పోలింగ్‌లో మాత్రం అంతకన్నా ఎక్కువగానే ఓట్లు లభించాయి. రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ నేతృత్వంలో నిర్వహించిన సమర్థవంతమైన ఫ్లోర్ మేనేజ్‌మెంట్ కారణంగా ఎన్డీయే సునాయాశ విజయం సాధించిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఎన్డీఏ కూటమి పక్షాలకు రెండ్రోజులపాటు నిర్వహించిన శిక్షణా తరగతులు, మిత్రపక్షాలతో సమన్వయం, పోలింగ్‌కు ముందు ప్రాంతాలవారీగా ఎంపీలతో సమన్వయం రాధాకృష్ణన్ గెలుపునకు దోహదం చేసిందని చెబుతున్నారు.

**మిన్నంటిన సంబరాలు..**

సీపీ రాధాకృష్ణన్ విజయం సాధించిన వెంటనే బీజేపీలో సంబరాలు మొదలయ్యాయి. కేంద్ర మంత్రి ప్రల్హాద్ జోషి నివాసం ముందు తమిళనాడు సంప్రదాయాలతో కూడిన సాంస్కృతిక కార్యక్రమాలు మొదలయ్యాయి. సీపీ రాధాకృష్ణన్‌కు బీజేపీ ఎంపీలతోపాటు ఆయనకు మద్దతిచ్చిన పక్షాల ఎంపీలు శుభాకంక్షలు తెలిపారు.

**రాష్ట్రపతి, ప్రధాని, అమిత్ షా, ఖర్గే శుభాకాంక్షలు**

ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన సీపీ రాధాకృష్ణన్‌కు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ, కేంద్ర అమిత్ షా సహ పలువురు శుభాకాంక్షలు తెలుపుతూ 'ఎక్స్'లో పోస్టులు చేశారు. 'ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన రాధాకృష్ణన్‌కు అభినందనలు. ప్రజాజీవితంలో దశబ్దాల గొప్ప అనుభవం, దేశ పురోగతికి గణనీయంగా దోహదపతుంది. విజయవంతమైన, ప్రభావవంతమైన పదవీకాలం కోసం మీకు ఇవే నా శుభాకాంక్షలు'అని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తన సందేశాన్ని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'రాధాకృష్ణన్‌కు ఎంపీగా, వివిధ రాష్ట్రాల గవర్నర్‌గా గొప్ప అనుభవం ఉంది. ఆయన పార్లమెంటరీ జోక్యాలు ఎల్లప్పుడూ చురుకైనవి. గవర్నర్‌గా పదవీకాలంలో, సాధారణ పౌరులు ఎదుర్కొన్న సవాళ్లను పరిష్కరించడంపై దృష్టి పెట్టారు. ఈ అనుభవాలు ఆయనకు శాసన, రాజ్యాంగ విషయాలపై అపార జ్ఞానం ఉందని నిర్ధారించాయి. ఆయన స్ఫూర్తిదాయకమైన ఉపరాష్ట్రపతి అవుతారని నాకు నమ్మకం ఉంది'ప్రధాని మోదీ పేర్కొన్నారు. రాధాకృష్ణన్ నాయకత్వ లక్షణాలను, పరిపాలనపై ఆయనకున్న లోతైన జ్ఞానాన్ని అమిత్ షా ప్రశంసించారు. రాధాకృష్ణన్ అనుభవం, అట్టడుగు స్థాయి నేపథ్యం దేశ పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి, అణగారిన వర్గాలకు సేవ చేయడానికి సహాయపడతాయని షా విశ్వాసం వ్యక్తం చేశారు. ఎగువ సభ సంరక్షకుడిగా ఆయన కొత్త పాత్రలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేసినప్పటి నుంచి పెదవివిప్పని జగ్‌దీప్ ధన్‌ఖడ్.. సీపీ రాధాకృష్ణన్ విజయం నేపథ్యంలో తొలిసారి స్పందించారు. ప్రజాజీవితంలో రాధాకృష్ణన్‌కు ఉన్న అపార అనుభవంతో ఉపరాష్ట్రపతి కార్యాలయం మరింత ఖ్యాతిని పొందుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు రాధాకృష్ణన్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయనకు లేఖ రాశారు.

**ఒత్తిళ్లకు లొంగరని ఆశిస్తున్నాం: ఖర్గే**

'ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో విజయం సాధించిన సీపీ రాధాకృష్ణన్‌కు శుభాకాంక్షలు. ఇండియా కూటమి అభ్యర్థి బి.సుదర్శన్‌రెడ్డి పోరాటానికి మా హృదయపూర్వక కృతజ్ఞతలు. రాధాకృష్ణన్ పార్లమెంటరీ సంప్రదాయాల అత్యున్నత నైతికతను నిలబెట్టుకుంటారని, ప్రతిపక్షాలకు గౌరవాన్ని ఇస్తారని, ఒత్తిళ్లకు లొంగరని ఆశిస్తున్నా. వర్షాకాల సమావేశాల్లో జగదీప్ ధన్‌ఖడ్ అకస్మాత్తుగా రాజీనామా చేశారు, ఇది ఎందుకు అనేది ఎప్పటికీ వివరించలేం. రాజ్యాంగ స్థానాల పట్ల గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత మనపై ఉంది'అని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు.

## దర్యాప్తు ఇంకా పూర్తి కాలేదు

-మొదటిపేజీ తరువాయి

కోర్టులో హాజరుపరిచారు. విజయవాడ, గుంటూరు కారాగారాల్లో రిమాండ్‌లో ఉన్న రాజ్ కెసిరెడ్డి, చాణక్య, సజ్జల శ్రీధర్‌రెడ్డి, వెంకటేశ్ నాయుడు, చెవిరెడ్డి భాస్కరరెడ్డి, బాలాజీ కుమార్ యాదవ్, నవీన్ కృష్ణలను బందోబస్తు మధ్య కోర్టుకు తీసుకొచ్చారు. బెయిల్‌పై విడుదలైన నలుగురు నిందితులు ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, గోవిందప్ప బాలాజీ, పైలా దిలీప్‌లు కూడా కోర్టుకు హాజరయ్యారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు వేసేందుకు వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డికి కోర్టు మధ్యంతర బెయిల్ ఇవ్వడంతో రాలేదు. ఆయన మినహా మిగిలిన 11 మందీ వచ్చారు. ఈ సందర్భంగా కోర్టులో ప్రాసిక్యూషన్స్ జేడీ.. నిందితులకు రిమాండ్ పొడిగించాలని మెమో వేశారు. దీనిని వ్యతిరేకిస్తూ నిందితుల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు. అరెస్టయి 90 రోజులు దాటిన నిందితులకు డిఫాల్ట్ బెయిల్ ఇవ్వాలని వాదించారు. ఈ కేసులో ఇటీవల విడుదలైన ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, గోవిందప్ప బాలాజీలకు మంజూరు చేసిన డిఫాల్ట్ బెయిల్ రద్దు చేయాలని కోరుతూ సిట్ అధికారులు హైకోర్టులో పిటిషన్ వేశారు. తదుపరి విచారణ ఈ నెల 11న ఉందని ఏసీబీ కోర్టు దృష్టికి ప్రాసిక్యూషన్స్ జేడీ తీసుకెళ్లారు. దీంతో నిందితుల రిమాండ్‌ను 12వ తేదీ వరకు పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది.

**బెయిల్ పిటిషన్లపై విచారణ వాయిదా**

సజ్జల శ్రీధర్‌రెడ్డి సోమవారం వేసిన బెయిల్ పిటిషన్‌ను సాంకేతిక కారణాలతో తిరస్కరించారు. తిరిగి మంగళవారం కోర్టులో దాఖలు చేశారు. దీని విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు. రాజ్ కెసిరెడ్డి దాఖలు చేసిన డిఫాల్ట్ బెయిల్ పిటిషన్‌పై ప్రాసిక్యూషన్ కౌంటర్ దాఖలుకు ఈ నెల 12వ తేదీకి వాయిదా పడింది. చెవిరెడ్డి భాస్కరరెడ్డి బెయిల్ పిటిషన్‌ను వాదనల కోసం 12వ తేదీకి వాయిదా వేశారు. చాణక్య దాఖలు చేసిన డిఫాల్ట్ బెయిల్ పిటిషన్‌పై సిట్ అధికారులు మంగళవారం కౌంటర్ దాఖలు చేశారు. విచారణను కోర్టు శుక్రవారానికి వాయిదా వేసింది. వెంకటేశ్ నాయుడి నుంచి స్వాధీనం చేసుకున్న ఫోన్ లాక్ తీసేందుకు అనుమతించాలని కోరుతూ సిట్ అధికారులు దాఖలు చేసిన పిటిషన్‌పై అభ్యంతరాలు తెలుపుతూ నిందితుల తరఫు న్యాయవాదులు కౌంటర్ వేశారు. పిటిషన్‌పై తదుపరి విచారణను 12వ తేదీకి వాయిదా వేశారు.

## దోమల నిర్మూలనకు మలాథియాన్ పిచికారీ



గన్నవరం

మండల పరిధిలోని బుద్దవరం పంచాయతీలో దోమల నియంత్రణకు మలాథియాన్ మందును పిచికారి చేసే కార్యక్రమాన్ని మంగళవారం సర్పంచ్ బడుగు బాలమ్మ, పాలకేంద్రం అధ్యక్షులు జి. నరేంద్ర ప్రారంభించారు. రమణమ్మ చెరువు, దళిత వాడ ఏరియాలో మురుగు కాలువలతో పాటు ఖాళీగా ఉన్న స్థలాల్లో పెరిగిన మొక్కల్లోనూ, ప్రభుత్వ హాస్టళ్లు స్కూళ్లలోనూ దోమల నిర్మూలన కోసం మందును చెల్లించారు. ఈ సందర్భంగా బాలమ్మ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న దాదాజీ గూడెం, రాజీవ్ కాలనీ, పామర్తి నగర్ సెంటర్, బుద్దవరం ఏరియాలో పూర్తిగా దోమల మందు పిచికారి చేస్తామని చెప్పారు. మురుగు కాలవల్లో నీరు నిలబడకుండా డ్రైన్లను శుభ్రం చేయిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దొరబాబు, పంచాయతీ సెక్రటరీ ప్రసాద్, సిబ్బంది రామారావు తదితరులు పాల్గొన్నారు.

## దోహాపై ఇజ్రాయెల్ బాంబులు



టెల్అవీవ్


రాజధాని దోహాలో ఉన్న హమాస్ తిరుగుబాటుదారులే లక్ష్యంగా ఇజ్రాయెల్ మంగళవారం "ఆపరేషన్ జడ్జిమెంట్ అసెంబ్లీ" పేరుతో బాంబు దాడులు చేసింది. నగరంలోని ఖతారా జిల్లా పరిధిలో పలు చోట్ల పేలుళ్లు సంభవించాయని, ఆకాశంలో దట్టమైన పొగలు అలుముకున్నాయని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. హమాస్ సీనియర్ నాయకులను గురిపెట్టి, ఈ దాడులు చేసినట్టు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస(ఐడీఎఫ్) తెలిపింది. ఈ దాడుల్లో హమాస్ నేతలు ఖలీల్-అల్-ఖాయా, ఖాలెద్ మషాల్‌తోపాటు.. వారి అంగరక్షకులు ముగ్గురు చనిపోయారని భావిస్తున్నట్లు పేర్కొంది. "సామాన్య పౌరులకు ఎలాంటి నష్టం జరగకుండా.. అత్యంత కచ్చితత్వంతో దాడులు చేశాం. 2023 అక్టోబరు 7న ఇజ్రాయెల్ పౌరులపై హమాస్ దాడి జరిపింది. ఆ దృశ్యాలను టీవీల్లో చూస్తూ.. 'థాంక్స్ గివింగ్ ప్రేయర్స్' చేసిన వారిలో ఖలీల్, ఖాలెద్ ఉన్నారు" అని వెల్లడించింది. గాజాలోనూ మంగళవారం ఏడు టవర్లను లక్ష్యంగా చేసుకుని, జరిపిన దాడుల్లో హమాస్ నేతలు చనిపోయినట్లు తెలిపింది. అటు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు సైతం దోహా దాడులకు తమదే బాధ్యత అని ప్రకటించారు. ఈ దాడులను ఫ్రాన్స్, సౌదీ అరేబియా ఖండించాయి. సౌదీ యువరాజు సల్మాన్ ఇజ్రాయెల్ చర్యను అంతర్జాతీయ నేరంగా పేర్కొంటూ.. ఖతార్‌కు తమ మద్దతు ఉంటుందని ప్రకటించారు. కాల్పుల విరమణ దిశలో ట్రంప్ ప్రయత్నాలు చేస్తున్న సమయంలో ఈ దాడులు జరగడం గమనార్హం..!

## ఎన్డీయేది నైతికంగా పరాజయమే

న్యూఢిల్లీ

ఉప రాష్ట్రపతి ఎన్నికలో ఎన్‌డీఏ సంఖ్యాపరంగా గెలిచినా నైతికంగా, రాజకీయంగా మాత్రం ఓటమి పాలైందని కాంగ్రెస్ అధ్యక్షుడు మలికార్జున ఖర్గే విమర్శించారు. ఇది కేవలం ఎన్నిక మాత్రమే కాదని, అంతకుమించిన సైద్ధాంతిక యుద్ధమని పేర్కొన్నారు. ఈ ఎన్నికలో ప్రతిపక్ష పార్టీలు ఐక్యంగా నిలబడ్డాయన్నారు. ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన సీపీ రాధాకృష్ణన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన అత్యున్నత పార్లమెంటరీ సంప్రదాయాలు పాటిస్తారని, ప్రతిపక్షానికి సమాన గౌరవం, అవకాశం ఇస్తారని, అధికార పక్షం ఒత్తిళ్లకు తలొగ్గరని ఆశిస్తున్నట్లు తెలిపారు.

## 'వరుస విజయాల వెనుక రహస్యమేంటి?'



అమరావతి

రాష్ట్ర మంత్రి లోకేశ్ తన ఢిల్లీ పర్యటనలో భాగంగా మంగళవారం కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆంధ్రప్రదేశ్‌లో 15 నెలలుగా చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఆయనకు వివరించారు. పాటిల్ పోటీ చేసిన తొలి ఎన్నిక నుంచి వరుసగా నాలుగుసార్లు మెజార్టీ పెంచుకుంటూ వెళ్తుండటంపై లోకేశ్ ఆయన్ను అభినందించారు. ఈ సందర్భంగా వారి మధ్య జరిగిన చర్చలో.. ఇంతగా ప్రజల అభిమానాన్ని చూరగొనడం వెనుకున్న విజయ రహస్యమేంటని లోకేశ్ అడిగినట్లు తెలిసింది. దీనికి పాటిల్ స్పందిస్తూ...నిరంతరం ప్రజలతో మమేకమవుతు, వారితో ఉండటమేనని తెలిపారు. తన నియోజకవర్గంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలనూ లోకేశ్‌తో పంచుకున్నట్లు తెలిసింది

# ఆగ్రహ జ్వాలలు



కాఠ్మండు/న్యూఢిల్లీ

సోషల్ మీడియా యాప్‌లపై నిషేధంతోపాటు విద్యార్థులు, యువత సోమవారం మొదలెట్టిన ఆందోళనలు మెరుపువేగంతో నేపాల్‌ను చుట్టేసి దేశాన్ని సంక్షోభ కుంపట్లోకి నెట్టేశాయి. సామాజిక మాధ్యమాల సేవలను పునరుద్ధరిస్తున్నామని కేపీ శర్మ ఓలీ సారథ్యంలోని ప్రభుత్వం కొద్ది గంటల్లోనే స్పష్టంచేసినా అప్పటికే పరిస్థితి చేయిదాటిపోయింది. రాజధాని కాఠ్మండు మొదలు దేశవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు, యువత తమ నిరసనజ్వాలలను మరింతగా ఎగదోస్తూ ఏకంగా పార్లమెంట్ భవనానికి నిప్పు పెట్టారు. మంగళవారం ఆందోళనలను అణచివేసేందుకు పోలీసులు, సైన్యం రంగంలోకి దిగాయి. కాళీమతిలో పోలీస్‌సర్కిల్‌కు నిప్పుపెట్టి అధికారులపై దాడి చేయడంతో పోలీసులు కాల్పులు జరిపారు. దీంతో ఇద్దరు చనిపోయారు. దీంతో కాల్పులు, పరస్పర ఘర్షణ ఘటనల్లో మరణాల సంఖ్య మంగళవారానికి 22కు పెరిగింది. 300 మందికిపైగా గాయపడ్డారు. కట్టలు తెంచుకున్న యువాగ్రహాన్ని తగ్గించే లక్ష్యంతో ప్రధానమంత్రి కేపీ శర్మ ఓలీ మంగళవారం తన పదవికి రాజీనామాచేశారు. భద్రంగా ఇంటి నుంచి సురక్షిత ప్రాంతానికి వెళ్లేందుకు నేపాల్ ఆర్మీ చీఫ్ అశోక్ రాజ్ సిగ్దెల్‌ను బతిమాలుకున్నట్లు వార్తలొచ్చాయి. ఆందోళనకారుల నిరసన కార్యక్రమం అదుపుతప్పి మాజీ ప్రధానమంత్రి, తాజా మంత్రులపై భౌతికదాడులదాకా వెళ్లింది. ప్రధాని ఓలీకి చెందిన భక్తపూర్‌లోని బాల్కోట్ నివాసాన్ని ఆందోళనకారులు తగులబెట్టారు. మాజీ ప్రధానమంత్రి ఝులనాథ్ ఖనాల్ ఇంటికి ఆందోళనకారులు నిప్పుపెట్టారు. ఈ మంటల్లో చిక్కుకుని ఆయన భార్య రాజ్యలక్ష్మి చిత్రకార్ తీవ్రంగా గాయపడ్డారు. హుటాహుటిన ఆమెను సమీప కీర్తిపూర్ బర్న్

**ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె ప్రాణాలు**

కోల్పోయారు. ఎటు చూసినా ఆస్తుల విధ్వంసం, వినాశనంతో నేపాల్ నిలువెల్లా రక్తమోడింది. దుకాణాల లూటీలు, పౌరుల భయాందోళనల నడుమ ప్రధాని రాజీనామాతో ఎట్టకేలకు సైన్యం పూర్తిస్థాయిలో రంగంలోకి దిగి శాంతభద్రతల పరిరక్షణ బాధ్యతలను తన చేతుల్లోకి తీసుకుంది. పరిస్థితులను తమకు అనుకూలంగా మల్చుకుని ప్రజల ఆస్తులను ధ్వంసంచేస్తూ లూటీలకు తెగించిన వాళ్ల అంతుచూస్తామని ఆర్మీ చీఫ్ హెచ్చరించారు. దేశాన్ని పట్టిపీడిస్తున్న అవినీతి, రాజకీయ వారసత్వం, సంపన్న, ఉన్నతస్థాయి వర్గాల ఆధిపత్యంపై ఇప్పటికే విసిగిపోయిన యువత తాజాగా సామాజికమాధ్యమాలపై హఠాత్తుక నిషేధం విధించడంతో వాళ్లలో ఆగ్రహం పెల్లుబికి మహోద్యమంగా మారడంతో దేశ భవిష్యత్తు ఇప్పుడు అగమ్యగోచరంగా తయారైంది.

**పెల్లుబికిన ఆగ్రహం**

పరిస్థితిని మరింతగా కట్టుతప్పొద్దనే ఉద్దేశంతో ప్రభుత్వం కర్ఫ్యూను విధించింది. అయినాసరే వేలాదిమంది విద్యార్థులు, యువత 'జెన్ జెడ్'కూటమిగా ఏర్పడి రాజధాని కాఠ్మండు మొదలు పట్టణాలదాకా విధ్వంసానికి తెగించారు. మాజీ ప్రధానమంత్రులు మొదలు తాజా కేబినెట్ మంత్రులు, కీలక నేతల దాకా ముఖ్యమైన వ్యక్తుల ఇళ్లకు నిప్పంటించారు. ప్రధాన రాజకీయ పార్టీల ప్రధాన కార్యాలయాలనూ ధ్వంసంచేశారు. కనిపించిన ప్రతి ఒక్క రాజకీయ నేతను చితకబాదారు. దేశాధ్యక్షుడు రాంచంద్ర పౌదెల్, మాజీ ప్రధాని పుష్పకమల్ దహాల్(ప్రచండ), ప్రస్తుత కమ్యూనికేషన్స్ మంత్రి పృథ్వీ సుబ్బా గురుంగ్, మాజీ హోం మంత్రి రమేశ్ లఖ్వార్, మాజీ ప్రధాని షేర్ బహదూర్ దేవ్‌బాల ఇళ్లను నాశనంచేశారు. ఆందోళనలు కాఠ్మండులోని త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయాన్నీ తాకాయి. దీంతో ముందుజాగ్రత్తగా అంతర్జాతీయ విమానసర్వీసులను రద్దుచేసి ఎయిర్‌పోర్ట్‌ను అధికారులు తాత్కాలికంగా మూసేశారు.

**ఎటుచూసినా విధ్వంసమే**

ఆందోళనలను ఏ దశలోనూ అడ్డుకోలేక పోలీసులు చేతులెత్తేయడంతో విద్యార్థులు, నిరసనకారుల విధ్వంసకాండ ఆకాశమే హద్దుగా సాగింది. పార్లమెంట్, దేశాధ్యక్షుని కార్యాలయం, ప్రధాని నివాసం, సుప్రీంకోర్టు భవనం, ప్రధాన రాజకీయ పార్టీల హెడ్‌ఆఫీస్‌లు, సీనియర్ నేతల ఇళ్లు, మీడియా కార్యాలయాలు ఇలా ప్రతి దేశంలోని కీలక భవంతులన్నీ ఆందోళనకారుల ఆగ్రహజ్వాలల బారినపడ్డాయి. డల్లూ ఏరియాలోని మాజీ ప్రదాని ఝులానాథ్ నివాసానికి నిప్పుపెట్టారు. కపన్ ప్రాంతంలోని నేపాలీ కాంగ్రెస్ నేత ఇంటిని తగులబెట్టారు.

సింఘదర్బార్‌లోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల సముదాయం భవనానికీ నిప్పుపెట్టారు. మహరాజ్‌గంజ్‌లోని అధ్యక్షకార్యాలయం, బలూవతార్‌లో ప్రధాని అధికారి నివాసం సైతం నిప్పురవ్వల వర్షంలో కాలిపోయాయి. టిన్‌కునేలో కాంతిపూర్ టెలివిజన్ ఆఫీస్‌ను ధ్వంసంచేశారు. బుద్ధనీలకంఠ ప్రాంతంలోని మాజీ ప్రధాని షేర్‌బహదూర్ దేవ్‌బా ఇంట్లో చొరబడి దేవ్‌బా, భార్య అర్జూ రాణాలను రక్తంకారేలా కొట్టారు. దీంతో ప్రాణభయంతో ఆయన పచ్చికబయళ్లకు పరుగులుపెట్టారు. విషయం తెల్సుకుని సైన్యం రంగంలోకి దిగి ఆయనను నిరసనకారుల బారినుంచి కాపాడింది. దేవ్‌బా కుమారుడు జైబీర్‌కు చెందిన కాఠ్మండులో హిల్టన్ ఐదునక్షత్రాల హోటల్‌కు, అర్జూకు చెందిన ఖుమల్తార్‌లోని ఉలెన్స్ పాఠశాలకు, తోఖాలో మాజీ ప్రధాని బాబూరామ్ భట్టారాయ్ ఇంటికి నిప్పుపెట్టారు. ఆర్థిక మంత్రి బిష్ణు ప్రసాద్ పౌడెల్‌ను వీధిలో పరుగెత్తించిమరీ చితక్కొట్టారు. వెనక నుంచి ఆయన్ను ఒకతను వీపుమీద ఎగిరి తన్నుతున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. గోశాల, లూభూ, కాళీమతి పోలీస్‌పోస్ట్‌లకూ నిరసనకారులు నిప్పుపెట్టారు. కలాంకీ, కాళీమతి, తహచల్, బనేశ్వర్, నైకాప్, ఛియాసల్, ఛపగావ్, థేచో ఇలా ప్రతి ప్రాంతంలో పెను విధ్వంసం సృష్టించారు.

టైర్లు తగలబెట్టి రోడ్లపై రాకపోకలను నిలిపేశారు. కమ్యూనిస్ట్ పార్టీ ప్రధాన కార్యాలయ భవనం ఎక్కి పార్టీ జెండాను చింపేశారు. పోఖ్రా పట్టణంలో ఆందోళనకారులు కారాగారం గోడలు బద్దలుకొట్టారు. దీంతో జైలులోని 900 మంది ఖైదీలు బయటకు పరుగులుతీశారు. కాఠ్మండూలోని నఖూ జైలుకూ ఇదే గతి పట్టింది. దీంతో ఇక్కడి ఖైదీలు విడుదలయ్యారు. వీరిలో మాజీ హోం మంత్రి రవి లమీచ్ఛానే సైతం ఉన్నారు. ఇదే అదనుగా కొన్ని అల్లరిమూకలు దుకాణాలను లూటీ చేశాయి.

**దిగిపోవాలని డిమాండ్ చేసి దింపేశారు**

మంగళవారం ఉదయం ప్రధాని కేపీ శర్మ ఓలీ కార్యాలయాన్ని చుట్టుముట్టిన వందలాది మంది ఆందోళనకారులు తర్వాత లోపలికి చొరబడి శర్మను వెంటనే గద్దె దిగాలని మొండిపట్టుపట్టారు. "కేపీ దొంగ, దేశాన్ని వీడిపో"అంటూ పెద్దగా నినాదాలు చేశారు. తప్పని పరిస్థితుల్లో వెంటనే ఆయన తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు దేశాధ్యక్షుడు రాంచంద్రకు లేఖ రాశారు. "నేపాల్ అసాధారణ పరిస్థితులను ఎదుర్కొంటోంది. పరిస్థితి కుదుటపడేందుకు రాజ్యాంగబద్ధంగా, రాజకీయంగా తగు పరిష్కారం కనుగొనేందుకు వీలుగా ప్రధాని పదవి నుంచి వైదొలుగుతున్నా"అని 73 ఏళ్ల సీనియర్ కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్(యునిఫైడ్ మార్కిస్ట్%-%లెనినిస్ట్) నేత శర్మ తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు.

వెంటనే రాజీనామాను అధ్యక్షుడు ఆమోదించారు. అయితే నూతన మంత్రివర్గం ఏర్పడేదాకా ఆయనే ఆపద్ధర్మ ప్రధానిగా కొనసాగుతారని దేశాధ్యక్షుడు చెప్పారు. నేపాల్ కాంగ్రెస్ పార్టీ అండతో గత ఏడాది జూలైలో శర్మ నాలుగోసారి ప్రధాని పదవిని చేపట్టడం తెల్సిందే. శర్మ దిగిపోవాలని నేపాల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గగన్ థాపా సైతం అంతకుముందే డిమాండ్‌చేశారు. చైనాతో సత్సంబంధాలు కొనసాగించే శర్మ తరచూ భారతవ్యతిరేక విధానాలను అవలంభించే నేతగా అప్రతిష్ట మూటగట్టుకున్నారు. గత షెడ్యూల్ ప్రకారం ఈనెలలోనే భారత్‌లో పర్యటించాల్సి ఉండగా ఆలోపే పదవీసన్యాసం చేశారు. అయితే శర్మ దేశాన్ని వీడి దుబాయ్‌కు వెళ్లనున్నారని, ఆయన కోసం రన్‌వే మీద హిమాలయ ఎయిర్‌లైన్స్ విమానాన్ని సిద్ధంగా ఉంచారని వార్తలొచ్చాయి.

**అగ్నికి ఆహుతవుతున్న ప్రధాని ఇల్లు**

బాణసంచా కాల్చి.. పారిపోకుండా ఆపి..

నేపాల్ నుంచి పారిపోయేందుకు నేతలకు హెలికాప్టర్ సేవలను అందిస్తోందన్న పుకార్లతో సిమ్రిక్ ఎయిర్‌లైన్స్ భవంతిని ఆందోళనకారులు తగలబెట్టారు. భైసేపతి మంత్రుల క్వార్టర్స్ నుంచి మంత్రులు విదేశాలకు హెలికాప్టర్లలో పారిపోతున్నారన్న వార్తలతో విద్యార్థులు అప్రమత్తమయ్యారు. వెంటనే ఎయిర్‌పోర్ట్ రన్‌వేల సమీపంలో బాణసంచా, రాకెట్లు కాల్చారు. దీంతో ఆకాశంలో పొగచూరింది. డ్రోన్లు ఎగరేసి, పౌర లేజర్‌లైట్లు రన్‌వే వైపు ప్రసరింపజేసి విమాన రాకపోకలను అడ్డుకోవాలని ప్రజలకు ఆందోళనకారులు సోషల్‌మీడియా వేదికగా పిలుపునిచ్చారు. అయితే అప్పటికే కొన్ని హెలికాప్టర్లు అక్కడి నుంచి వెళ్లిపోయాయని వార్తలొచ్చాయి. కొందరు మంత్రులు, వీవీఐపీలు ఆర్మీ బ్యారెక్‌లలో తలదాచుకున్నారు.

**పార్లమెంట్‌ను రద్దుచేయండి: బాలెన్ షా**

యువతలో విపరీతమైన ఆదరణ ఉన్న కాఠ్మండు నగర మేయర్, 35 ఏళ్ల బాలేంద్ర షా మాత్రం వెంటనే పార్లమెంట్‌ను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. "నిరసనకారులు శాంతించాలి. విద్యార్థి బృందాలు తక్షణం ఆర్మీ చీఫ్‌తో చర్చలకు సంసిద్ధమవ్వాలి. అంతకుముందే పార్లమెంట్‌ను రద్దుచేయాలి"అని అన్నారు. మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని, తాము ఎంపీలుగా రాజీనామా చేస్తామని రాష్ట్రీయ స్వతంత్ర పార్టీకి చెందిన 21 మంది ఎంపీలు ప్రకటించారు. ఉద్యమానికి తమ పూర్తి మద్దతు తెలిపారు. తాను సైతం రాజీనామా చేస్తున్నట్లు నీటిపారుదల శాఖ మంత్రి ప్రదీప్ యాదవ్ చెప్పారు.

**చర్చించుకుందాం.. రండి**

ఆందోళనను విడనాటి చర్చలకు రావాలని జెన్ జెడ్ విద్యార్థి, యువలోకానికి దేశాధ్యక్షుడు రాంచంద్ర పౌదెల్ పిలుపునిచ్చారు. శాంతి, సుస్థిరతకు అందరం పాటుపడుతున్నామంటూ నేపాల్ ఆర్మీ చీఫ్ అశోక్‌రాజ్ సిగ్దెల్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏక్ నారాయణ్ ఆర్యల్, హోం సెక్రటరీ గోకర్ణ దవాదీ, సాయుధ పోలీసు బలగాల చీఫ్ రాజు ఆర్యల్, ఐజీ చంద్ర కుబేర్, జాతీయ దర్యాప్తు విభాగ సారథి హుత్రాజ్ థాపా సంతకాలు చేసి ఒక సంయుక్త ప్రకటన విడుదలచేశారు.

అయితే 26 సోషల్‌మీడియా సైట్ల పునరుద్దరణతోపాటు వాక్ స్వాతంత్ర్యం, ప్రభుత్వ ఉద్యోగుల్లాగా రాజకీయనేతలకూ రిటైర్మెంట్ వయసును ప్రకటించాలని పలు డిమాండ్లను యువత ప్రభుత్వం ముందుంచింది. మంత్రులు, ఉన్నతవర్గాల కుటుంబాలే సకల సౌకర్యాలను పొందుతున్నాయని ఉద్యమకారులు సోషల్‌మీడియాలో ప్రచారాన్ని మొదలెట్టారు. పరిస్థితిని చక్కదిద్ది ప్రభుత్వం, ఆర్మీ దేశంలో మళ్లీ శాంతిని నెలకొల్పాలని నేపాల్‌లోని ఆస్ట్రేలియా, ఫిన్లాండ్, ఫ్రాన్స్, జపాన్, ద.కొరియా, బ్రిటన్, అమెరికా రాయబార కార్యాలయాలు సంయుక్త ప్రకటనలో అభ్యర్థించాయి. ఉద్యమాలు శాంతియుతంగా సాగాలని హింసాత్మక పథం పనికిరాదని ఐక్యరాజ్య సమితి సైతం హితవు పలికింది.

# చెదిరిపోతున్న కెనడా కలలు

కెనడాలో ఉన్నత విద్య అభ్యసించడానికి భారతీయ విద్యార్థులు అమితంగా ఆసక్తి చూపుతుంటారు. అయితే, వారి ఆశలను కెనడా ప్రభుత్వం నీరుగారుస్తోంది. ఈ ఏడాది ఇప్పటిదాకా 80 శాతం ఇండియన్ స్టూడెంట్ వీసా దరఖాస్తులను తిరస్కరించింది. గత పదేళ్ల కాలంలో ఇదే అత్యధికం కావడం గమనార్హం. ఇమ్మిగ్రేషన్, రెఫ్యూజీస్ అండ్ సిటిజెన్‌షిప్ కెనడా(ఐఆర్‌సీసీ) ఈ విషయం స్వయంగా వెల్లడించింది.  భారతీయ విద్యార్థులే ఎక్కువగా ప్రభావితం అయినట్లు గణాంకాలను బట్టి తెలుస్తోంది. ఆసియాతోపాటు ఆఫ్రికా దేశాల విద్యార్థుల వీసా దరఖాస్తులు అధికంగా తిరస్కరణకు గురయ్యాయి. వీసాలు సులభంగా లభించే పరిస్థితి లేకపోవడంతో కెనడా విద్యాసంస్థల్లో విదేశీయుల ప్రవేశాలు సైతం తగ్గిపోతున్నాయి. 2024లో 1.88 లక్షల మంది భారతీయ విద్యార్థులు కెనడా విద్యాసంస్థల్లో చేరారు. రెండేళ్ల క్రితం ఈ సంఖ్య 3.60 లక్షలకు పైగానే ఉండేది. భారతీయ విద్యార్థులు ఇప్పుడు జర్మనీపై దృష్టి పెడుతున్నారు. 2022లో కెనడాకు ప్రాధాన్యం ఇచ్చిన భారతీయుల విద్యార్థులు 18 శాతం ఉండగా, 2024లో అది 9 శాతానికి పడిపోయింది. జర్మనీకి వైపు ఆసక్తి చూపినవారి సంఖ్య గత ఏడాది 31 శాతంగా ఉంది.

**ఎందుకీ పరిస్థితి?**

అమెరికాలో విదేశీ విద్యార్థులపై పలు ఆంక్షలు అమల్లోకి వచ్చాయి. విద్యార్థి వీసా నిబంధలను ప్రభుత్వం కఠినంగా మార్చింది. విదేశీ విద్యార్థుల రాకపై ఆంక్షలు విధించింది. కెనడా సర్కార్ సైతం ఇదే బాటలో నడుస్తున్నట్లు తెలుస్తోంది. దేశంలో ఇళ్ల కొరత వేధిస్తోంది. మౌలిక సదుపాయాలపై విపరీతమైన ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలో విదేశీయుల రాకను అడ్డుకోవాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. స్థానిక రాజకీయాలకు ప్రభుత్వం తలవంచక తప్పని పరిస్థితి ఏర్పడింది. విదేశీ విద్యార్థులపైనా ఆ ప్రభావం పడుతోంది. ఆర్థిక వనరులు బలీయంగా ఉన్న విద్యార్థులకే కెనడా వీసాలు లభించే అవకాశం ఉంది. లాంగ్వేజ్ టెస్టులోనూ మంచి ప్రతిభ చూపాల్సి ఉంటుంది. సమగ్రమైన స్టడీ ప్లాన్ సమర్పించాలి. అంతేకాకుండా రూల్స్ ఆఫ్ వర్క్‌ను సైతం కఠినంగా మార్చారు. చదువుకుంటూ ఖర్చుల కోసం పార్ట్‌టైమ్ జాబ్ చేయడం ఇక కష్టమేనని నిపుణులు చెబుతున్నారు.

**గమ్యస్థానం జర్మనీ**

ఈ ఏడాది విదేశీ విద్యార్థులకు 4,37,000 వీసాలు ఇవ్వాలని కెనడా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇది గత ఏడాది కంటే 10 శాతం తక్కువ కావడం విశేషం. ఇందులో 73,000 వీసాలు పోస్టుగ్రాడ్యుయేట్ విద్యార్థులకు, 2,43,000 వీసాలు అండర్‌గ్రాడ్యుయేట్ విద్యార్థులకు నిర్దేశించారు. 1,20,000 వీసాలు రెన్యూవల్స్, పాఠశాల విద్యార్థులకు సంబంధించినవి. కెనడా వీసా చాలా ఖరీదైన అంశంగా మారిపోయింది. దరఖాస్తు, టెస్టులు, ఫీజులు తడిసిమోపెడవుతున్నాయి. ఒకసారి దరఖాస్తు తిరస్కరణకు గురైతే మళ్లీ దరఖాస్తు చేసుకోలేక చాలామంది వెనక్కి తగ్గుతున్నారు. మొత్తానికి కెనడా కలలు చెదిరిపోతున్నాయి. మరోవైపు విదేశీ విద్యార్థులపైనే ఆధారపడి మనుగడ సాగించే కెనడా కాలేజీలు, యూనివర్సిటీ పరిస్థితి దారుణంగా మారింది. ఆర్థిక ఇబ్బందులతో కొన్ని కాలేజీలు ఇప్పటికే మూతపడ్డాయి. మరికొన్ని ఇతర కాలేజీల్లో విలీనమయ్యాయి. ఇదిలా ఉండగా, కెనడాకు ద్వారాలు మూసుకుపోతుండడంతో జర్మనీ విద్యాసంస్థల్లో చేరే భారతీయుల సంఖ్య పెరుగుతోంది. 2023లో 49,500 మంది చేరారు. 2025లో ఇప్పటికే 60,000 మంది ప్రవేశాలు పొందారు. జర్మనీలో టెక్నాలజీ, మేనేజ్‌మెంట్, ఇంజనీరింగ్ తదితర కీలక విభాగాల్లో తక్కువ ఫీజులకే మెరుగైన విద్య లభిస్తోంది. అమెరికా, కెనడాతో పోలిస్తే జర్మనీలో జీవన వ్యయం కూడా చాలా తక్కువ.  ఈ అంశాలే జర్మనీని ఉన్నత విద్యకు గమస్థానంగా మారుస్తున్నాయి.

# అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

ధర్మశాల/చండీగఢ్

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం హిమాచల్ ప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాల్లో పర్యటించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించారు. నీట మునిగిన పంట పొలాలు, ధ్వంసమైన ఇళ్లు, రహదారులను స్వయంగా పరిశీలించారు. బాధితులతో మాట్లాడారు. భారీ వర్షాలు, వరదలకు తోడు కొండచరియలు విరిగిపడడంతో తీవ్రంగా నష్టపోయిన హిమాచల్ ప్రదేశ్‌కు తక్షణ సాయం కింద రూ.1,500 కోట్లు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. వరదల్లో మృతిచెందినవారి కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారం ఇస్తామని వెల్లడించారు. హిమాచల్ ప్రదేశ్‌లో ఏరియల్ సర్వే అనంతరం కాంగ్రా పట్టణంలో ప్రధాని మోదీ సమీక్షా సమావేశం నిర్వహించారు. సహాయ పునరావాస చర్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి సుఖ్వీందర్‌సింగ్ సుఖూ పాల్గొన్నారు. వరద బాధితులు సైతం హాజరై తమ గోడు వినిపించారు. తమను ఆదుకోవాలని ప్రధాని మోదీని వేడుకున్నారు.  కచ్చితంగా అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. వరదల్లో దెబ్బతిన్న మౌలిక సదుపాయాలను సాధ్యమైనంత త్వరగా పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. ధ్వంసమైన ఇళ్లను ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద పునర్నిర్మించాలని సూచించారు. రాష్ట్రంలో ఈ ఏడాది జూన్ 20 నుంచి సెప్టెంబర్ 8 దాకా వరదలు, కొండచరియల కారణంగా ఏకంగా 370 మంది మృతిచెందారు.

**పంజాబ్‌లో సహాయక చర్యలపై ఆరా**

ప్రధాని మోదీ హిమాచల్ ప్రదేశ్‌లో పర్యటన అనంతరం పంజాబ్‌కు చేరుకున్నారు. వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వే నిర్వహించారు. బాధితులను కలిసి మాట్లాడారు. అన్ని విధాలుగా ఆదుకుంటామని, ధైర్యంగా ఉండాలని వారికి సూచించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలతోనూ మాట్లాడారు. సహాయక చర్యలపై ఆరా తీశారు. గురుదాస్‌పూర్‌లో సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు.  పంజాబ్‌కు తక్షణ సాయం కింద రూ.1,600 కోట్లు అందజేస్తామని ప్రకటించారు. భారీ వర్షాలతోపాటు సట్లెజ్, బియాస్, రావి నదులు ఉప్పొంగి ప్రవహించడంతో పంజాబ్‌లో భారీ నష్టం వాటిల్లింది. 51 మంది మరణించారు. 1.84 లక్షల హెక్టార్లలో పంటలు నీట మునిగాయి. రూ.13,000 కోట్ల నష్టం జరిగినట్లు ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసింది. రూ.20,000 కోట్ల సహాయ ప్యాకేజీ ప్రకటించాలని ప్రధాని మోదీని ఆమ్ ఆద్మీ పార్టీ డిమాండ్ చేసింది.

**చిన్నారి నీతికతో మోదీ**

హిమాచల్‌ప్రదేశ్‌లోని కాంగ్రాలో సమీక్షా సమావేశం సందర్భంగా ప్రధాని మోదీ 14 నెలల చిన్నారి నీతికను ఎత్తుకొని బుజ్జగించారు. ప్రకృతి విలయం వల్ల అనాథగా మారిన నీతిక దీనగాథ విని ఆయన చలించిపోయారు.

హిమాచల్‌ప్రదేశ్‌లో మండీ జిల్లాలోని తల్వారి గ్రామంలో జూన్ 30న రాత్రిపూట హఠాత్తుగా భారీ వర్షం కురిసింది. గ్రామంపై కొండ చరియలు విరుచుకుపడ్డాయి. ఓ ఇంట్లో రమేశ్ కుమార్(31), రాధాదేవి(24) దంపతులు తమ కమార్తె నీతికతోపాటు తల్లి పూనమ్‌దేవితో కలిసి నిద్రిస్తున్నారు. ఇంట్లోకి బురద చొచ్చుకొచ్చింది. నీతికను వంట గదిలో పడుకోబెట్టి బురదను తొలగించేందుకు ముగ్గురూ ప్రయత్నించారు. ఇంతలో భారీ కొండచరియ ఆ ఇంటిపైకి దూసుకొచ్చింది. వంట గది మినహా ఆ ముగ్గురున్న గది నేలమట్టమైంది. రమేశ్ కుమార్, రాధాదేవి, పూనమ్‌దేవి బురదతోపాటు కొట్టుకుపోయి మృత్యువాత పడ్డారు. వంట గదికి నష్టం జరగకపోవడంతో నీతిక ప్రాణాలతో బయటపడింది. ఆ సమయంలో నీతిక వయసు 11 నెలలే. నీతికను హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వం 'చైల్డ్ ఆఫ్ ద స్టేట్'గా ప్రకటించింది. ఆమె చదువుతోపాటు జీవనానికి అయ్యే ఖర్చులు భరిస్తామని ప్రకటించింది

## ఆర్ఆర్ఆర్ ఉత్తరం పనులు ప్రారంభించండి..

-మొదటిపేజీ తరువాయి

మంగళవారం కేంద్రమంత్రిని ఆయన నివాసంలో రేవంత్ కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పలు జాతీయ రహదారుల నిర్మాణం, అనుమతులు, పనుల వేగవంతం చేయాల్సిన అవసరంపై కేంద్రమంత్రితో చర్చించారు. హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగానికి సంబంధించి 90% భూసేకరణ పూర్తయిందని తెలిపారు. వెంటనే ఆర్థిక అనుమతి, కేంద్రమంత్రివర్గ అనుమతి ఇచ్చి పనులు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ఉత్తరభాగం పనులతోనే దక్షిణభాగం పనులు కూడా చేపట్టాలని కోరారు. దీనికి సంబంధించిన అనుమతులు వేగంగా ఇవ్వాలని కోరారు. హైదరాబాద్‌ను ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీశైలంతో అనుసంధానించే మన్ననూర్–శ్రీశైలం రహదారి అమ్రాబాద్ టైగర్ రిజర్వు పరిధిలో ఉన్నందున నాలుగు వరుసల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దీనికి తోడుగా ఓఆర్ఆర్ దగ్గర రావిర్యాల నుంచి ఆమనగల్ మీదుగా మన్ననూరు వరకు నాలుగు వరుసల గ్రీన్‌ఫీల్డ్ రహదారిని నిర్మించాలని కోరా రు. అలాగే, హైదరాబాద్–మంచిర్యాల మధ్య ఉన్న రాజీవ్ రహదారిపై వాహన రద్దీ అధికంగా ఉన్నందున.. నూతన గ్రీన్‌ఫీల్డ్ రహదారిని మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. సీఆర్ఐఎఫ్ కింద రూ.868 కోట్లతో ప్రతిపాదించిన రహదారుల పనులను మంజూరు చేయాలని కోరారు. ఈ వినతుల పట్ల నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించారు. సీఆర్ఐఎఫ్ పనులకు వారం లోపు అనుమతులు ఇస్తామని తెలిపారు. గ్రీన్‌ఫీల్డ్ రహదారికి సంబంధించి తమ శాఖ అధికారులను హైదరాబాద్‌కు పంపుతానని హామీ ఇచ్చారు. ఈ అంశంపై ఎన్‌హెచ్ఏఐ అధికారులతో ఈ నెల 22న హైదరాబాద్‌లో సమీక్ష నిర్వహిస్తామని రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రికి తెలిపారు.

## పీసీసీ అధ్యక్షుడే అప్రూవర్‌గా మారారు

-మొదటిపేజీ తరువాయి

అప్రూవర్‌గా మారి.. నేరాంగీకారం తెలిపిన తర్వాత విచారణ ఎందుకు? చర్చ ఎందుకు? వారిపై వేటు వేసేందుకు స్పీకర్‌కు మొహమాటం ఎందుకు?'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె.తారక రామారావు (కేటీఆర్) ప్రశ్నించారు.  మాజీ మంత్రి లక్ష్మారెడ్డి భార్య శ్వేతారెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆయన మాజీ మంత్రి హరీశ్‌రావుతో కలిసి నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండలంలోని ఆవంచ గ్రామానికి వచ్చారు. శ్వేతారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు. హరీశ్‌రావు తిరిగి హైదరాబాద్‌కు పయనమైన అనంతరం కేటీఆర్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ మారిన వారు ఏ పార్టీ లో ఉన్నారో చెప్పుకోలేని దురవస్థలో ఉన్నారన్నారు. స్పీకర్ నిర్ణయంలో తేడా ఉంటే.. టీపీసీసీ అధ్యక్షుడు మాట్లాడింది సుప్రీంకోర్టు ముందు పెడతామని స్పష్టం చేశారు.

**రాజకీయ లబ్ధికోసమే 'మేడిగడ్డ'..**

కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందంటూ కాంగ్రెస్ నాయకులు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని.. రాజకీయ కక్షతో కేసీఆర్‌పై కేసు పెట్టేందుకు యత్నిస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ప్రాజెక్టుకు ఖర్చు చేసిందే రూ.94 వేల కోట్లు అని.. ఈ విషయాన్ని సీఎం రేవంత్ మామ పద్మారెడ్డి క్లియర్‌గా చెప్పారని.. అలాంటప్పుడు లక్ష కోట్ల అవినీతి ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. మేడిగడ్డలో 85 పిల్లర్లలో రెండు కుంగిపోతే అంతర్జాతీయ సమస్యగా చిత్రీకరించి.. రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు.

**'ఫార్ములా- ఈ' ఓ లొట్టపీసు కేసు..**

'నేను మళ్లీ చెప్తున్నా.. ఫార్ములా–ఈ ఒక లొట్టపీసు కేసు. ఈ అంశంలో ఎవరైనా వచ్చి నన్ను లై డిటెక్టర్ పరీక్ష చేసుకోవచ్చు'అని కేటీఆర్ సవాలు చేశారు. హైదరాబాద్‌కి ఫార్ములా– ఈ రేసును తీసుకురావడానికి తాను ప్రయత్నాలు చేశానని చెప్పారు. రేసు నిర్వహణ కోసం ప్రభుత్వం నుంచి రూ.46 కోట్లు ఇవ్వాలని తానే ఆదేశాలు ఇచ్చానని, డబ్బులు కూడా నిర్దేశిత ఖాతాలోకే చేరాయన్నారు. మంగళవారం నందినగర్ నివాసంలో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. 'ఫార్ములా ఈ రేస్ కేసులో ప్రతి రూపాయికి లెక్క ఉంది. ప్రాసిక్యూషన్ చేసినా, చార్జిషీట్లు వేసినా ఏమీ చేయలేరు'అని కేటీఆర్ స్పష్టం చేశారు.

# ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం


**రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా మధిర**

**ఖమ్మం జిల్లా ప్రతినిధి ఆర్ రమేష్ అక్షరేఖ న్యూస్ సెప్టెంబర్ 9** ఎర్రుపాలెం మండలంలో పలు అభివృద్ధి నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమాల్లో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క. గ్రామీణ మౌలిక వసతులు అభివృద్ధి ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం నియోజకవర్గంలోనీ ఎరుపాలెం మండలంలో పలు గ్రామాల్లో అంతర్గత సిసి రోడ్లు, అంగన్వాడి భవన నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. మధిర నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తూ రాబోయే 50 సంవత్సరాలకు సరిపడా అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేసుకునే దిశగా నియోజకవర్గంలో ప్రణాళికా ప్రకారం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా మధిరను తీర్చిదిద్దడమే తన లక్ష్యం అన్నారు. శాశ్వత అభివృద్ధి ప్రణాళికలో భాగంగా ప్రతి గ్రామానికి ఆధునిక మౌలిక వస్తువులను పూర్తిస్థాయిలో ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు హామీ ఇచ్చినట్టుగానే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి జరుగుతుందన్నారు. నియోజకవర్గ ప్రజల అవసరాలు, కోరికలను దృష్టిలో పెట్టుకొని వివిధ ప్రాజెక్టులను శరవేగంగా పూర్తి చేసే కార్యక్రమం కొనసాగుతుందన్నారు. నియోజకవర్గ అభివృద్ధి ఒక కొత్త దిశలో పరుగులు పెడుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఎర్రుపాలెం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో 45 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణాలకు, పెద్ద గోపవరం గ్రామంలో 12 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న అంగన్వాడీ భవన నిర్మాణ పనులకు, పెద్ద గోపవరం గ్రామం ఎస్సీ కాలనీలో 85 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణాలకు, బుచ్చిరెడ్డి పాలెం గ్రామం ఎస్సీ కాలనీలో 40 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణాలకు, బనిగండ్లపాడు గ్రామం ఎస్సీ కాలనీలో కోటి 75 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణాలకు, అయ్యవారిగూడెం ఎస్సీ కాలనీలో 55 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణాలకు, భీమవరం గ్రామంలో 12 లక్షలతో నిర్మించనున్న అంగన్వాడీ భవన నిర్మాణ పనులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మంగళవారం ఎర్రుపాలెం మండలంలో విస్తృతంగా పర్యటించారు, వందలకోట్ల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామంలో భారీగా జనం తరలివచ్చారు. డబ్బు చప్పుళ్ళు, మంగళ హారతులతో డిప్యూటీ సీఎంకు



స్వాగతం పలికారు. ప్రతి గ్రామంలో డిప్యూటీ సీఎం పై ప్రేమతో పూల వర్షం కురిపించారు. మధిర నియోజకవర్గం అభివృద్ధి పనుల పై డిప్యూటీ సీఎం సమీక్ష మంగళవారం మధ్యాహ్నం బనిగండ్లపాడు లో భోజన విరామం అనంతరం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తో కలిసి రెవిన్యూ, ఫారెస్ట్, పంచాయతీరాజ్, విద్యాశాఖ, ఆరోగ్యశాఖ, పర్యాటకశాఖ అధికారులతో విడివిడిగా సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, వాటి పూర్తికి అధికారులు చేపట్టాల్సిన చర్యలు, రాబోయే రోజుల్లో చేపట్టాల్సి ఉన్న అభివృద్ధి కార్యక్రమాల పై సమీక్ష నిర్వహించారు.

## ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాల్లోనే దైవదర్శనాలకు వెళ్లే ప్రజలకు శుభవార్త




**అక్షర రేఖ న్యూస్ (ప్రతినిధి) యాచారం** సెప్టెంబర్ 9 .9 .2025 ఇబ్రహీంపట్నం డిపో నుంచి స్పెషల్ దైవదర్శన ఆరవటూర్ ప్యాకేజ్ ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాల్లోని దైవదర్శనాలకు వెళ్లే ప్రజలకు శుభవార్త డిపో నుండి చక్కని అవకాశం ఉందని డిపో మేనేజర్ వెంకట నర్సప్ప గారు తెలపడం జరిగింది. ఈ కింద తెలిపిన ప్రసిద్ధ దేవాలయాలను ఒకేరోజు దర్శించుకునే గొప్ప అవకాశం కల్పించడం జరిగింది. మెట్రో డీలక్స్ లో పెద్దలు కేవలం 1200 / రూపాయలు చిన్నలు కేవలం 1000/ రూపాయలు చెల్లించి సెప్టెంబర్ 13వ తేదీన శనివారం ఉదయం ఐదు గంటలకు బయలుదేరే మల్లికార్జున స్వామి టెంపుల్. భద్రకాళి టెంపుల్. వేయి స్తంభాల గుడి. రామప్ప టెంపుల్. లక్న వరం సదస్. దర్శనం అనంతరం. తిరిగి అదే రోజు రాత్రి తొమ్మిది గంటలకు ఇబ్రహీంపట్నం చేరుకుంటుంది. ముఖ్యంగా 30 మంది భక్తులు ఉన్నచో వారి దగ్గరికి బస్సు రావడం జరుగుతుంది.. ముఖ్యంగా ఈ విహార యాత్రలో. టీ. టిఫిన్లు మరియు దర్శనానికి సంబంధించిన చార్జీలు ఎవరికి వారే భరించుకోవలెను. ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని కోరుచున్నాము.

## రంగారెడ్డి జిల్లా డి ఈ ఓ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది సిఐటియు



**అక్షర్ రేఖ న్యూస్ (ప్రతినిధి) యాచారం** సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ గారు మాట్లాడుతూ కార్మికులతో బెట్టి చాకిరి చేస్తున్నారు కనికరం లేకుండా అప్పులు తీసుకొచ్చి వంటలు చేస్తున్నారు ఆ బిల్లు కోసం ఎదురుచూస్తున్నారు భోజనాలు కూరగాయలు శుభ్రంగా చేసి పెడుతున్న సూటిపోటి మాటలతో వేధిస్తున్నారు అనే ఆవేదన వ్యక్తం చేశారు మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్లో ఉన్న గౌరవ వేతనం. బిల్లులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ. అలాగే పెండింగ్ బిల్లుల కోసం ఈ నెల 16 17 తేదీల్లో భారీ ఎత్తున కార్మికులను మహిళలను కూడా గట్టి ధర్నా నిర్ణయిస్తామని చెప్పడం జరిగింది నేడు మధ్యాహ్న భోజనం కార్మికులు యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా డీఈవో గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సిఐటియు జిల్లా నాయకులు పోచమ్మని కృష్ణ మహిళా కార్మికులు పాల్గొన్నారు

## ప్రజాకవి కాళోజీ సేవలు చిరస్మరణీయం...

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



**ఖమ్మం జిల్లా ప్రతినిధి ఆర్ రమేష్ అక్షర రేఖ న్యూస్ సెప్టెంబర్ 9** ప్రజా చైతన్యమే లక్ష్యంగా మహాకవి కాళోజీ నారాయణ రావు రచనలు సాహితీవేత్తగా సమాజానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ప్రజాకవి స్వర్గీయ కాళోజీ నారాయణరావు 111 వ జయంతి సందర్భంగా మంగళవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, ప్రజాకవి కాళోజీ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, తెలంగాణ జీవిత చలనశీలి కాళోజి అని, పుట్టుక, చావులు కాకుండా బతుకంతా తెలంగాణ కిచ్చిన మహనీయుడు, వైతాళికుడు కాళోజి అని అన్నారు. ప్రజాకవి కాళోజీ నారాయణరావును యువత ఆదర్శంగా తీసుకొని ఉన్నతంగా ఎదగాలని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మశ్రీ, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారిణి డా. కళావతి బాయి, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ఏ. శ్రీనివాస్, ఎస్సి కార్పొరేషన్ ఇడి నవీన్ బాబు, కలెక్టరేట్ ఏవో కె. శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

# బీజేపీదే అప్రజాస్వామిక పాలన

**జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్**

**ఓట్ల చోరీతో గద్దెనెక్కి హామీలు ఏమార్చి**



**ఖమ్మం జిల్లా ప్రతినిధి ఆర్ రమేష్ అక్షర రేఖ న్యూస్ సెప్టెంబర్ 9** 11 ఏండ్ల నుండి దేశంలో బిజెపి అప్రజాస్వామిక పాలన సాగుతోందని ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శ్రీ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ ఆరోపించారు. ఖమ్మంలో కాంగ్రెస్ పాలనపై బీజేపీ చేసిన ధర్నాను ఖండిస్తూ సమావేశం ఏర్పాటు చేశారు.. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శ్రీ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ... బిజెపి మోడీ పరిపాలన ఎలా ఉందంటే వారు అధికారంల్లోకి వచ్చే ముందు కేంద్రంలో అనేక డోల్ల హామీలను ప్రకటించి దొడ్డి దారిన అధికారంలోకి వచ్చారు బిజెపి అధికారం లోకి వచ్చి నేటి 11 సంవత్సరాలు దాటింది ఆనాడు బిజెపి అధికారం చేపట్టడానికి ఈ దేశంలో సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని నల్లధనన్ని వెలికి తీసి ప్రతి పేదవాడు అకౌంట్లో 15 లక్షలు జమ చేస్తానని, స్విస్ బ్యాంకులో మూలుగుతున్న నల్లధనాన్ని ఇండియాకు రప్పించి ఇండియా కష్టాలు తీరుస్తానని అనేక బూటకపు మాటలు చెప్పి అధికారాన్ని చేపట్టారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు కూడా ఏ ఒక్క హామీని నెరవేర్చపోగా రాజ్యాంగాన్ని నిర్వీర్యపరిచి ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బిజెపి పాలనపై ప్రజలు ఇసుకుపోతే అది గమనించి నా మోదీ మొన్న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో దొంగ ఓట్లు సృష్టించుకుని కొంతమంది దొంగల్ని కలుపుకొని కేంద్రంలో అధికారాన్ని చేపట్టి రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తున్నారు మీరుకూడా కాంగ్రెస్ పాలనపై విమర్శించే స్థాయికి వచ్చారా ఇక్కడ ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ రెండేళ్లలోనే అనేక సంక్షేమ పథకాలు ప్రకటించి ఈ రాష్ట్రాన్ని అగ్రగామిలో నిలిపి రాష్ట్రన్నీ అభివృద్ధిలో పరుగులు తీస్తున్న కాంగ్రెస్ పాలన మీకు నచ్చక పోవడానికి ప్రధాన కారణం మీలాగా కాంగ్రెస్ పార్టీ దోచుకు తినదని దోచుకునే అవలంబన కాంగ్రెస్ పార్టీకి లేదని ఈ సందర్భంగా తెలియజేస్తున్న సిగ్గుమాలిన వ్యవహారాలన్నీ మానుకొని జాగ్రత్తగా ఉంటే మంచిదని ఈ సందర్భంగా తెలియజేస్తున్న ఈ రాష్ట్రంలో ఈ దేశంలో రాహుల్ గాంధీ ఆలోచన విధానంతోనే ఈనాడు బీసీ డిక్లరేషన్ తీసుకువచ్చి బీసీలకు రాజకీయాలలో ఉద్యోగాలలో అవకాశాలు కల్పించడానికి ఈ రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుంటే మీరు దాన్ని కాలయాపన చేసి బీసీ రిజర్వేషన్ను అమలుపరచకుండా అడ్డుపడుతున్నారు అడ్డుపడటమే కాకుండా అనేక అడ్డగోలు విమర్శలు చేస్తున్నారు.. తస్మాత్ జాగ్రత్త మీ మోదీ పరిపాలనలో ప్రజలు ఏ రకంగా అవస్థ చెందుతున్నారు మొన్న బీహార్ లో మీ వ్యవహార శైలినీ ప్రజలందరూ గమనిస్తున్నారు. మీలాగా గంగ ఓట్లతో మేము అధికారంలోకి రాలేదు అలాంటి పని మేము చెయ్యం మీరంతా దొంగలు కాబట్టి దొంగ ఓట్లతో అధికారంలోకి వచ్చారని తెలియజేస్తున్నాను అది గమనించి మీరు ఈ రాష్ట్రంలో నడుచుకోవాలని లేని పక్షంలో ప్రజలు మీపై తిరగబడి మిమ్మల్ని ఎవర్ని కూడా బయట తిరగకుండా చెప్పులతో కొడతారని తెలియజేస్తున్నాను తస్మాత్ జాగ్రత్త.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఎప్పటికప్పుడు పూర్తి చేస్తూ ఉండాలి

**జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.**



**అక్షర రేఖ సెప్టెంబర్ 09, 2025- నిర్మల్:** జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఎప్పటికప్పుడు పూర్తి చేస్తూ ఉండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రాత్రి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పురోగతిపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన ముడి సరుకులు, మ్యాన్ పవర్ అందుబాటులో ఉంచుకోవాలని పేర్కొన్నారు. ఇప్పటివరకు మండలాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి లభించిన అనుమతులు, వివిధ దశల వారిగా నిర్మాణం పూర్తయిన ఇండ్లకు సంబంధించి వివరాలను మండలాల వారిగా సమీక్షించారు. మండల ప్రత్యేక అధికారులు ఎప్పటికప్పుడు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రక్రియను పర్యవేక్షించాలని అన్నారు. ఇండ్ల నిర్మాణానికి ఆర్థిక కష్టాలు ఉన్న వారిని గుర్తించి, మహిళా సంఘాల ద్వారా రుణాలు ఇప్పించాలని పేర్కొన్నారు. ఇసుక కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, హౌసింగ్ పిడి మండల ప్రత్యేక అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఇదేం గలీజు దందా!

**వేసవిలో 'చిట్టడివి'ని సృష్టించారంట**

**బల్దియా పార్కులో అను'మతి లేని రెస్టారెంట్'**

**ప్రజల వినోదానికి ఏర్పాటు చేసిన పార్కులో ఫుడ్ బిజినెస్**

**టికెట్ పెట్టి ఎంట్రీ ఫీజు రూ.50 వరకు వసూలు**

**కరీంనగర్ బల్దియా నిర్లక్ష్యం.. చెలరేగుతున్న లీజుదారులు**

**పార్కులో 5000 మొక్కలు నాటి, అడవిని సృష్టించామంటూ గొప్పలు**

**బల్దియా వీరికి పార్కు ఇచ్చిందా? స్థలమిచ్చిందా? అని వాకర్స్ ప్రశ్న**

**సాయంత్రానికి రెస్టారెంట్‌కు అనుమతి లేదన్న ఎంసీకే కమిషనర్**




**కరీంనగర్:** కరీంనగర్‌లో స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు కింద రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన మల్టీపర్పస్ పార్కును ఇష్టానికి వినియోగిస్తున్నారు. పార్కు స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపట్టడం, అనుమతి లేకున్నా రెస్టారెంట్లు, దాబాలు ఏర్పాటు చేస్తూ హడావుడి చేస్తున్నారు. ఈ దందాలో మాజీ కార్పొరేటర్లు భాగస్వాములు కావడంతో బల్దియా అధికారులు అటువైపు కన్నెత్తి చూసే సాహసం చేయడం లేదు. కమిషనర్ అసలు మల్టీపర్పస్ పార్కులో రెస్టారెంట్‌కు ఎలాంటి అనుమతి లేదని, రద్దు చేస్తామని తొలుత తెలిపారు. రాత్రి 8.30 గంటల తరువాత ఇదే విషయాన్ని అధికారికంగా మాట్లాడారు. వినోదం కోసం ఏర్పాటుచేసిన పార్కులో ప్రజల జేబులకు చిల్లుల పడేలా వ్యవహరిస్తున్న మాజీ కార్పొరేటర్లు, వారితో కుమ్మక్కయిన బల్దియా అధికారులు కలిసి ఇంతకాలం చేసిన ఈ వ్యవహారం కమిషనర్ జోక్యంతో ముగిసినట్లయింది.

### అసలేం జరిగింది?

కరీంనగర్ స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో చేపట్టిన మల్టీపర్పస్ పార్కు నిర్మాణం ఆదినుంచి వివాదాల నడుమే సాగింది. నిర్మాణంలో సుదీర్ఘ జాప్యం జరిగిందన్న విమర్శలు వెల్లువెత్తాయి. ఒప్పందం ప్రకారం నిర్మించిన కాంట్రాక్టరు మూడేళ్లపాటు నిర్వహణ బాధ్యతలు చూడాలి. అతన్ని కాదని మరో కాంట్రాక్టరుకు నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. తరువాత ఓ మాజీ కార్పొరేటర్ భాగస్వామిగా ఉన్న సంస్థకు లీజుకిచ్చారు. ఈ లీజు చెల్లదంటూ పలువురు మాజీ కార్పొరేటర్లు ఫిర్యాదులు చేసినా బల్దియా వర్గాలు పట్టించుకోలేదు. పార్కులో ప్రవేశానికి రూ.20 ఎంట్రీ ఫీజు వసూలు చేయడం ప్రారంభించారు. దీనిపై విమర్శలు వచ్చినా.. భాగస్వాముల్లో మాజీ కార్పొరేటర్ ఉండటంతో బల్దియా అధికారులు కిమ్మనలేదు. తరువాత ఈ ఫీజును వారాంతాల్లో రూ.50కి పెంచారు. ఒప్పందంలో రూ.50ఫీజుగా తాము నిర్ణయించలేదని కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్ స్పష్టం చేశారు. ఈ లెక్కన వారంతాల్లో రూ.50 చొప్పున వసూలు చేసిన అధికఫీజు ఎవరి జేబులోకి వెళ్లింది అనేది ప్రశ్నార్థకంగా మారింది. అది చాలదన్నట్లుగా ఇక్కడ రెస్టారెంట్ ప్రారంభించారు. వాస్తవానికి మున్సిపల్ పార్కుల్లో చిప్స్ తదితర ప్యాక్డ్ ఫుడ్ విక్రయించాలి. అక్కడే ఆహారం వండితే పొగ, కూరగాయల వ్యర్థాలతో వాకర్స్‌కు ఇబ్బంది కలుగుతుంది. ఎలకలు పందికొక్కులు వచ్చి మొక్కలను నాశనం చేస్తాయి. నగరవాసులకు ఆహ్లాదం కోసం నిర్మించిన పార్కు లక్ష్యం కాస్తా.. పక్కదారి పడుతోంది. ప్రస్తుతం లీజుకు తీసుకున్న నిర్వాహకులు బల్దియా అధికారులతో ఉన్న పాత పరిచయంతో రెస్టారెంట్ నిర్మాణం ప్రారంభించారు. లీజుకు తీసుకున్న వారు వాకర్స్‌కు ఆహారం అందిస్తామంటూ మున్సిపల్ కమిషనర్‌కు పెట్టుకున్న దరఖాస్తు వింతగా ఉంది. వారు పార్కును ఈ ఏడాది ఏప్రిల్ నుంచి రెండేళ్ల కాలానికి లీజుకు తీసుకుని అభివృద్ధి చేశామని, వేసవికాలంలోనూ పార్కులో 5000 మొక్కలు నాటామని, చిన్నపాటి అడవిని సృష్టించామని, ఆక్సిజన్ జోన్‌గా మార్చామని చెప్పుకున్నారు. ఇందుకోసం ఏకంగా రూ.50 లక్షలు ఖర్చు చేశారంట. అందుకే, సందర్శకుల తాకిడి పెరిగి ఆహారం అందించాలని పట్టుబడుతున్నారని లేఖలో పేర్కొన్నారు. కాబట్టి రెస్టారెంట్‌కు అనుమతి కావాలంటూ 6వ తేదీన కమిషనర్‌కు ఒక దరఖాస్తు పెట్టుకున్నారు. తీరా 7వ తేదీన ప్రారంభోత్సం చేశారు. కేవలం 18 గంటల్లో అక్కడ రెస్టారెంట్ కొలువుదీరిన రహస్యం అటు బల్దియా, ఇటు నిర్వాహకులకు మాత్రమే తెలుసు.

తమకు అన్ని రకాల అనుమతులు ఉన్నాయని వాదనకు దిగాడు. తీరా సాయంత్రానికి కమిషనర్ అనుమతులనే రద్దు చేశామని ప్రకటించడంతో చేసేది లేక తోకముడిచాడు. ఈ విషయమై వివరణ కోరేందుకు యత్నించగా సంబంధిత ఇంజినీర్లు ఫోన్లు స్విచాఫ్ చేసుకోవడం గమనార్హం. చివరకు బల్దియా కమిషనర్ అధికారికంగా రెస్టారెంట్‌ను మూసివేస్తామని ప్రకటించడంతో బల్దియా అధికారుల ఫోన్లు స్విచ్‌ఆన్ అయ్యాయి. బల్దియా అధికారుల అవినీతి, వారికి మామూళ్లు ఇచ్చి అక్రమాలకు పాల్పడుతున్న మాజీ కార్పొరేటర్ల ధనదాహానికి ఈ రెస్టారెంట్ చక్కటి ఉదాహరణ అని నగరవాసులు అభివర్ణిస్తున్నారు.

## నరకప్రాయంగా రహదారులు

**నిజామాబాద్ :** ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో వరద సృష్టించిన విలయ తాండవానికి భారీ ఎత్తున రోడ్లు ధ్వంసమయ్యాయి. బీటీ రోడ్లు నామరూపాల్లేకుండా కొట్టుకు పోవడంతో వాహనాల రాకపోకలు నిలిచి పోయాయి. ప్రస్తుతం నడక కూడా నరకప్రా యంగా మారింది. కంకర తేలిన రోడ్లపై టూ వీలర్, ఫోర్ వీలర్లతో ప్రయాణించడం గగనమైంది. ఆర్టీసీ బస్సు సర్వీసులు ఇప్పటికే పలు చోట్ల పునరుద్ధరణకు నోచు కోలేదు. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 5 మండలాల్లో ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్ రోడ్లు తీవ్రంగా నష్టం సంభవించింది. వీటి విలు రూ.20కోట్లు వరకు ఉంటుందని ప్రాథమిక అంచనాలు చెబుతున్నాయి. కామారెడ్డి జిల్లాలో వంతెనలతో సహా జాతీయ, రాష్ట్ర రహదారులు నామరూపాల్లేకుండా పోవడంతో నష్టం భారీగా ఏర్పడింది. కామారెడ్డి జిల్లాలో రోడ్డు భవనాల శాఖ(ఆర్ అండ్ బి) రోడ్లు 65 కిలో మీటర్ల మేర ధ్వంసం అయ్యాయని అంచనాలు సిద్ధమయ్యాయి. 48 కల్వర్టులు తీవ్ర స్థాయిలో దెబ్బతిన్నాయి. వీటి మొత్తం విలువ సుమారుగా రూ.130 కోట్లు ఉంటుందని ఆర్ అండ్ బి అధికారులు అంచనా వేస్తున్నారు. ఇనేక చోట్ల ప్రస్తుతం తాత్కాలిక మరమ త్తులు చేస్తున్నారు. బీటీ రోడ్లు దెబ్బతిన్న చోట మట్టి పోసి రాకపోకలకు అనువుగా మార్చుతున్నారు. వానలు లేకపోవడంతో ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉంది. 11 రోజులవుతోన్న ఇప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని వీడలేదు. ముఖ్యమంత్రి పర్యటించి వెళ్లినప్పటికీ అంచనాల రూపకల్పనలోనే అధికార యంత్రాంగం నిమగ్నం అవ్వడం విడ్డూరంగా మారింది. సీఎం పర్యటనలో ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు వస్తాయని అంతా భావించారు. కానీ అలాంటిదేమీ లేకుండా పోయింది.

### నిజామాబాద్‌లో 5 మండలాల్లో దెబ్బతిన్న రోడ్లు

నిజామాబాద్ జిల్లాలో వరద సృష్టించిన విధ్వంసంలో ప్రధానంగా 5 మండలాల్లో అస్తవ్యస్త పరిస్థితులు నెలకొన్నాయి. బోధన్, భీంగల్, ధర్పల్లి, సిరికొండ, ఇందల్వాయి మండలాల్లో వరద ఉధృతికి ఆర్‌అండ్‌బి, పీఆర్ రోడ్లు చిన్నాభిన్నమయ్యాయి. పలు చోట్ల కోతకు గురవ్వడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నేటికీ భారీ వాహనాలు వెళ్లడం ఇబ్బందిగానే మారింది. ఇందల్వాయి మండలంలో జాతీయ రహదారి 44 -గన్నారం, తిర్మన్‌పల్లి రాంపూర్, తిర్మన్‌పల్లి - ధర్పల్లి, ఎల్లారెడ్డిపల్లి - లోలం, అన్సన్‌పల్లి - సిర్నాపల్లి రోడ్లు ధ్వంసమయ్యాయి.

Printed, Published & Owned by V. SAI KRISHNAREDDY, Printed at SAI KRISHNA PRINTERS, Door No. 7-7-86/1, Near Collector Chowk, Adilabad (T.S) 504001 Published at H.No. 1-2-125/1, Pithruchaya Nilayam, Shanti Nagar, Adilabad-504001 (T.S) Editor: V. SAI KRISHNA REDDY, RNINO. TELTEL/2012/44706, CELL:7073352171, Email: akshararekhadaily@gmail.com